హైదరాబాద్
శనివారం
5-1-2019
సంపుటి: 3, సంచిక: 8
పేజీలు: 8+8, వెల: రూ.5
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం అక్షర యజ్ఞం..



రాష్ట్రంలో డిఫెన్స్ మ్యూజియం!
ఏర్పాట్లు చేస్తున్న పర్యాటక శాఖ

2లో..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



భద్రతను గాలికొదిలేశారు

ఆరోపించే ముందు హోంవర్కు చేయండి

డిఫెన్స్ డీల్.. డీల్ ఇన్ డిఫెన్స్‌కు తేడా ఉంది

కాంగ్రెస్ పార్టీపై నిర్మలా సీతారామన్ ఫైర్

5లో..



రఫేల్‌పై విచారణ చేయిస్తాం

అధికారంలోకి రాగానే ఆదేశాలు

ఒప్పందలో అవినీతి, అక్రమాలు

అభ్యంతరాలను తోసిపుచ్చిన మోదీ

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ఫైర్

5

సర్పంచ్‌ల ఏకగ్రీవాలపై టీఆర్ఎస్ దృష్టి

ఏకగ్రీవ పంచాయతీలకు నగదు ప్రోత్సాహకాలు

ప్రభుత్వం ఇచ్చే దానికి రూ. 15 లక్షలు అధికం

స్థానిక సంస్థల పాలక మండళ్ల ఏకగ్రీవాలకు ఒప్పందాలు

కనీసం 6 వేల జీపీల ఏకగ్రీవంతో సరికొత్త రికార్డు?

అసెంబ్లీ టార్గెట్ 100 మాదిరే పంచాయతీల్లో 10,000

లక్ష్య సాధనకు కార్యరంగంలోకి దూకిన ఎమ్మెల్యేలు

హైదరాబాద్, జనవరి 4(మనం ప్రతినిధి):

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏక గ్రీవాలపై అధికార టీఆర్ఎస్ దృష్టి కేంద్రీకరించింది. అత్యధిక గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేసే దిశగా చర్చలు చేపట్టింది. స్థానిక నాయకులతో ఈ మేరకు చర్చలు కొనసాగుతున్నాయి. ఎన్నికల ఖర్చు కుదించడం. రాజకీయ స్థిరత్వాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నగదును పొందడం లక్ష్యంగా గ్రామ స్థాయిలో చక్రం తిప్పుతుంది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించి విజయోత్సవాలు చేసుకుంటున్న టీఆర్ఎస్ శ్రేణులు గ్రామ పంచాయతీల ఏకగ్రీవాలపై చర్చకు తెరలేపాయి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సిరిసిల్లలో జరిగిన కార్యకర్తల సమావేశంలో గ్రామ పంచాయతీల ఏకగ్రీవాలపై నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం రూ. 10 లక్షల ప్రోత్సాహకాన్ని ఇస్తుంది. దానికి తోడు శాసనసభ్యుల నియోజక వర్గం అభివృద్ధి నిధి నుండి మరో రూ.15 లక్షలు ఇవ్వడానికి కేటీఆర్ ముందుకొచ్చారు. దీంతో ఏకగ్రీవ ఎన్నికలు జరిగిన గ్రామ పంచాయతీకి రూ. 25 లక్షల నగదు ప్రోత్సాహకం అభించే అవకాశం ఉంది. కేటీఆర్ మార్గంలోనే మరి కొంత మంది యువ ఎమ్మెల్యేలు గ్రామ పంచాయతీల ఏక గ్రీవం కోసం స్థానిక నాయకత్వాన్ని మిగతా 2లో..





సీఎం కేసీఆర్ దుబాయ్ టూర్

6 నుంచి 13 వరకు పర్యటన

హైదరాబాద్, జనవరి 4(మనం ప్రతినిధి):

ముఖ్యమంత్రి కేసీఆర్ దుబాయ్ పర్యటనకు వెళ్లాలని నిర్ణయించారు. ఈ నెల 6 నుంచి 13 వరకు దుబాయ్‌లో పర్యటించాలనే నిర్ణయం మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వచ్చే ఆదివారం ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రి దుబాయ్‌కి బయలుదేరనున్నారు. సంక్రాంతి పండుగ సమయంలో ఆయన తిరిగి రాష్ట్రానికి చేరుకుంటారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎంవో కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లాయి. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో ప్రోటోకాల్, జీఏడీ అధికారులు తీరికలేకుండా ఉన్నారు.

ఇకపై ఐరిస్‌తో రేషన్ సరుకులు

16 జిల్లాల్లో 5186 షాపుల్లో ప్రారంభించిన కమిషనర్ అకున్ సబర్వాల్

3లో..

ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిరమాసం; తిథి: అమావాస్య తె.5.56 వరకు(తెల్లవారితే ఆదివారం); నక్షత్రం: మూల ప.3.10 వరకు; తదుపరి: పూర్వాషాఢ; వర్జ్యం: రా.1.31 నుంచి 3.15 వరకు; దుర్ముహూర్తం: ఉ.6.34 నుంచి 8.03 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుంచి 10.30 వరకు; యమగండం: ప.1.30 నుంచి 3.00 వరకు; అమృతఘడియలు: ఉ.8.20 నుంచి 10.02 వరకు;

ఇదీలోకం!

అయ్యప్ప శ'రణం'



శబరిమలలో, కేరళలో టెన్షన్ టెన్షన్!

శబ్ద విప్లవంతో ఉత్తమ్ గూబ పగిలింది



అసెంబ్లీ ఎన్నికల ఓటమితో కాంగ్రెసోళ్ల దిమ్మదిరిగింది

పంచాయతీల్లో వారు పోటీ చేసే పరిస్థితి లేదు

చంద్రబాబు పైసలతో కాంగ్రెస్ కుట్ర చేసింది

నల్లగొండ జిల్లా టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్,జనవరి 4 (మనం ప్రతినిధి):

తెలంగాణ ప్రజలు గుంజి కొడితే.. ఆ శబ్ద విప్లవానికి ఉత్తమ్ గూబ పగిలిందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఉత్తమ్ కుమార్‌కు చాలా అహంకారముంది. జడ్పీ మీటింగ్ పెడితే జానా రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఏనాడూ హాజరు కాలేదని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో హుజూర్ నగర్ చరిత్ర తిరగరాయాలి. గెలుపు మిగతా 2లో..



సంక్రాంతి స్పెషల్

పండుగకు ప్రత్యేక బస్సులు

రోజుకు 1000కి పైగా అదనం

రెండు తెలుగు రాష్ట్రాల ఆర్టీసీల ఉమ్మడి నిర్ణయం

తెలంగాణకు ఎంజీబీఎస్ నుంచి, ఏపీకి ఎల్బీనగర్ నుంచి బయలుదేరుతాయి

2లో..

పార్లమెంట్ సమరానికి సనద్ధం కండి

10 రోజుల్లో పీసీసీ కొత్త కమిటీలు

- ఐదుగురితో ఎన్నికల మేనేజ్‌మెంట్ టీం
- 30లోగా కమిటీల ఏర్పాటు పూర్తి చెయ్యాలి
- ఏఐసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి జేడీ శీలం
- టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ





హైదరాబాద్, జనవరి 04 (మనంప్రతినిధి):

త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల సమరానికి కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమైంది. పేరు కోసం కాకుండా పని చేసే వారికి పదవులు ఇస్తూ కమిటీలను ఏర్పాటు చెయ్యాలని ఏఐసీసీ రాష్ట్ర పార్టీ నాయకత్వాన్ని ఆదేశించింది. 10 రోజుల్లో పీసీసీ కొత్త కమిటీలు ఏర్పాటు చెయ్యాలని, ఐదుగురితో ఎన్నికల నిర్వహణ టీంను సిద్ధం చేయాలని, ఈ నెల 30లోగా అన్ని కమిటీలను ఏర్పాటు ప్రక్రియను పూర్తి చెయ్యాలని ఎఐసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి జేడీ శీలం ఆదేశించారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డికి లేఖ రాశారు. పార్లమెంట్ సమరానికి సన్నద్ధమయ్యేందుకు మిగతా 2లో..

ఒక్క నిమిషంలో వాయిదా

అయోధ్య కేసు విచారణ ఈనెల 10న

60 సెకండ్ల పాటే కోర్టులో విచారణ

కొత్త బెంచి విచారిస్తుందన్న సీజేఐ

ఈ మధ్యలో నిర్ణయిస్తామని వెల్లడి

కోర్టువద్ద పెండింగులో 14 అప్పీళ్లు

న్యూఢిల్లీ, జనవరి 4:

రామ జన్మభూమి-బాబ్రీ మసీదు భూ వివాదం కేసు విచారణను సుప్రీం కోర్టు ఈనెల 10వ తేదీకి వాయిదా వేసింది. శుక్రవారం విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఇరువైపులలో ఎవరి మిగతా 2లో..





మరో మహిళ..!

అయ్యప్ప ఆలయంలోకి శ్రీలంక మహిళ

- 18 మెట్లు ఎక్కి స్వామి దర్శనం
- సుప్రీం తీర్పు తర్వాత ముగ్గురు..
- గర్భసంచి తొలగించారన్న శశికళ
- మెడికల్ సర్టిఫికెట్ చూపి.. దర్శనం
- కేరళలో రాజ్యమేలుతున్న ఉద్రిక్తత
- సమగ్ర దర్యాప్తు: రాజ్‌నాథ్‌కు వినతి



శబరిమల, జనవరి 4:

ఒకవైపు ఇప్పటికే ఇద్దరు మహిళలు అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించినందుకు తీవ్రస్థాయిలో ఉద్రిక్తతలు రాజ్యమేలుతుంటే.. మరోవైపు గురు వారం రాత్రి శ్రీలంక దేశానికి చెందిన 46 ఏళ్ల మహిళ 18 మెట్లు ఎక్కి అయ్యప్ప దర్శనం చేసుకున్నారు. దీంతో సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాత మిగతా 2లో..



సంక్రాంతి స్పెషల్


హైదరాబాద్, జనవరి 4 (మనం ప్రతినిధి): సంక్రాంతి పర్వదినాల సందర్భంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకూ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం టీఎస్ఆర్టీసీ, ఏపీఎస్ఆర్టీసీ దాదాపు 4,600 ప్రత్యేక బస్సులను నడిపించాలని నిర్ణయించాయి. రెండు రాష్ట్రాల ఆర్టీసీ ఉన్నతాధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. వీలైనన్ని ఎక్కువ బస్సులను అందుబాటులో ఉంచాలని, గత సంవత్సరంతో పోలిస్తే మరిన్ని బస్సులు తిప్పాలని దీనిలో నిర్ణయించారు. 2018లో 3,200 బస్సులను తిప్పామని గుర్తు చేసిన అధికారులు, ఈ సంవత్సరం రద్దీ మరింతగా పెరుగుతుందని అంచనా వేస్తూ, బస్సుల సంఖ్యను పెంచినట్టు తెలిపారు. ఈ సంక్రాంతి సీజన్ లో 12వ తేదీ శనివారం, 13 ఆదివారం రావడంతో రద్దీ అధికంగా ఉంటుందని భావిస్తున్నట్టు తెలిపారు. రోజుకు 1000కి తక్కువ కాకుండా బస్సులను సిద్ధం చేస్తామని, ఏ ప్రాంతానికి డిమాండ్ ఉంటే, అక్కడికి పంపుతామని టీఎస్ ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ పీ కొమురయ్య వెల్లడించారు. టీఎస్ఆర్టీసీ బస్సులు ఎంజీబీఎస్ నుంచి, ఏపీఎస్ఆర్టీసీ బస్సులు ఎల్బీనగర్ లోని చింతలకుంట నుంచి బయలుదేరుతాయని అధికారులు తెలిపారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాలకు వెళ్లే బస్సులను జూబ్లీ బస్ స్టేషన్ నుంచి నడిపిస్తామని అన్నారు. కర్నూలు, అనంతపురం, బెంగళూరు, కడప, చిత్తూరు బస్సులు ఎంజీబీఎస్ నుంచి, వరంగల్ బస్సులు ఉప్పల్ నుంచి బయలుదేరుతాయని తెలిపారు.

సర్పంచ్‌ల ఏకగ్రీవాలపై టీఆర్ఎస్ దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

ప్రోత్సహిస్తున్నారు. పోటీ చేసి లక్షలకు లక్షలు ఖర్చు చేసేదానికంటే కూడా పోటీ లేకుండా అంగీకార యోగ్యమైన పద్ధతిలో ఏక గ్రీవం చేసుకున్న పక్షంలో ప్రచార వ్యయం మిగలడంతో పాటుగా గ్రామానికి రూ. 25 లక్షల అభివృద్ధి నిధి పొందే అవకాశం ఉంటుందని నచ్చజెప్పుతున్నారు. కొంత మంది పార్లమెంటు సభ్యులు కూడా గ్రామ పంచాయతీల ఏకగ్రీవంపై దృష్టి కేంద్రీకరించారు. ఒప్పందాలతో సర్దుబాటు చేసుకోవడంతో గ్రామ పంచాయతీల పాలక మండళ్లను ఏకగ్రీవం చేసే ఆలోచనలో ఉన్నారు. ప్రతిపక్షాలు డీలాపడ్డాయని భావిస్తున్న అధికార పక్షం ఇదే అదునుగా భావించి గ్రామ పంచాయతీలను కూడా అత్యధిక స్థాయిలో కైవసం చేసుకొనేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతుంది. టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవలి కాలంలో పలువురు సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలతో గ్రామ పంచాయతీ ఎన్నికలపైన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్ని కొత్త గ్రామ పంచాయతీల్లో పార్టీ సానుభూతిపరులను గెలిపించుకోవాలని వారికి సూచించారు. మహిళలకు రిజర్వు చేసిన గ్రామాలను కూడా గులాబీ గూటికి చేర్చాలని తెలియచేశారు. గతంలో సర్పంచులుగా ఇతర పార్టీల వారు గెలిచి టీఆర్ఎస్‌లో విలీనమైన గ్రామ పంచాయతీలను కూడా కైవసం చేసుకొనవలసి ఉందని ముఖ్యమంత్రి సూచించారు.

ఏకగ్రీవాలతో పార్టీ ప్రతిష్ట మరింత పెరుగుతుంది. మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పాటుగా పురపాలక సంఘాల ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలకు ఈ ప్రక్రియ దోహదపడుతుంది అని కేసీఆర్ వివరించినట్లు తెలిసింది. గ్రామ పంచాయతీల ఏకగ్రీవం తాజాగా ఎన్నికైన అత్యధికులైన ఎమ్మెల్యేలకు సవాల్‌గా మారింది. తమ తమ నియజక వర్గాల్లో అత్యధిక గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేయడం ద్వారా అధిష్టానం ఎదుట తమ బలం రుజువు చేసుకోవడంతో పాటు రాజకీయ ప్రయోజనం పొందాలనే ఆలోచనతో పలువురు యువ ఎమ్మెల్యేలు దూకుడుగా వ్యవహరిస్తున్నారు.



మంత్రివర్గం కూర్పునకు ముందు జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు కొంత మంది రాజకీయ పలుకుబడికి పరీక్షగా మారిందంటున్నారు. మహిళలకు రిజర్వు కాబడిన గ్రామ పంచాయతీలపై అత్యధికులు దృష్టి కేంద్రీకరించారు.

కొన్ని నియోజక వర్గాల్లో ఇప్పటికే రంగంలోకి దిగిన ఎమ్మెల్యేలు గ్రామ సర్పంచ్‌తో పాటుగా జెడ్పిటీసీ,ఎంపిటీసీ, మండలాధ్యక్షుడు, సహకార ఎన్నికలు, నామినేటెడ్ పదవులు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు తదితర ప్రజా ప్రాతినిధ్య పదవులపై ఒప్పందాలు చేసే పనిలో నిమజ్ఞమయ్యారు. గ్రామ పంచాయతీ మొదలుకొని జిల్లా పరిషత్ వరకు పార్టీలో ఎవరెవరికి ఏ హోదాతో గౌరవించాలనే అంశంపై చర్చలకు తెరలేపారు. గ్రామ, మండల స్థాయి పదవులతో పాటు, సహకార సంఘాల ఎన్నికల విషయంలో సాధ్యమైనంత వరకు ఒప్పంద ప్రాతిప్రదికన పదవులు పంచుకొనేందుకు అత్యధికులు సానుకూలంగా స్పందిస్తున్నప్పటికీ పురపాలక సంఘాలు, జిల్లా పరిషత్‌ల విషయంలో రాష్ట్ర స్థాయి నాయకత్వం జోక్యం అనివార్యం అనే పరిస్థితి కనబడుతుందని టీఆర్ఎస్ నేతలు వెల్లడించారు. తెలంగాణలో 4602 మంది మహిళా సర్పంచుల సంఖ్య 6378 కి చేరింది. దీనికి తోడు 1.13 లక్షల వార్డులు ఉన్నాయి. అందులో 56,690 వార్డులను మహిళలకు కేటాయించారు. మొత్తంగా 12,732 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. 10,000కు పైగా గ్రామ పంచాయతీలను టీఆర్ఎస్ కైవసం చేసుకోవడంతో పాటుగా కనీసం 6 వేల గ్రామ పంచాయతీలను ఏక గ్రీవం చేయడం ద్వారా దేశంలోనే ఒక సరికొత్త రికార్డును సృష్టించాలనే ఆలోచనతో టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉన్నాడని పార్టీ వర్గాలు తెలిపాయి. టీఆర్ఎస్ 88 శాసనసభ నియోజక వర్గాలను గెలుచుకోవడంతో పాటుగా మరో ఇద్దరు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరినందున 90 నియోజక వర్గాల్లోని అత్యధిక గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేయడం, గెలుచుకోవడంతో టీఆర్ఎస్‌కు గ్రామ రాజకీయాల్లో తిరుగులేదనే సంకేతాలు వెలువడవలసి ఉందనే ఆలోచనతో కేసీఆర్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారని తెలిపారు.

గ్రామ పంచాయతీలు పార్టీ రహితంగా జరుగుతున్నప్పటికీ టీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా పని చేస్తున్న నాయకులనే సర్పంచులుగా నిలబెట్టడం జరుగుతుందన్నారు. శాసనసభ ఎన్నికల్లో అత్యధికులైన సర్పంచులు పార్టీ కోసం పని చేయడం వల్లనే భారీ మెజారిటీతో టీఆర్ఎస్ అభ్యర్థులు శాసనసభకు ఎన్నికయ్యారని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా పని చేయవలసి ఉందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనను కలుస్తున్న పార్టీ నేతకు హితవు పలికారు.

శబ్ద విప్లవంతో ఉత్తమ్ గూబ పగిలింది



(మొదటిపేజీ తరువాయి)

కోసం పక్కా ప్రణాళికతో పని చేయాలి. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ కు చెందిన పెద్ద పెద్ద నేతలు ఓడిపోయారు. నాగార్జున సాగర్ లో జానారెడ్డి కూడా ఓడిపోయారు. ఆరోగ్యం బాగోలేని సోనియాను కూడా తీసుకొచ్చి ప్రచారం చేయించారు.

చంద్రబాబును తరిమి తరిమి కొడితే.. కాంగ్రెస్ మళ్లీ పట్టుకొచ్చింది. చంద్రబాబు ఇచ్చిన రూ. 500 కోట్లతో కాంగ్రెస్ కుట్రలు చేసిందన్నారు. కాంగ్రెస్ నేతలు అమరావతికి గులాములుగా మారినా.. తెలంగాణ ప్రజలు మాత్రం తమ అస్థిత్వాన్ని చాటుకున్నారు. 2014లో 63 సీట్లు గెలిస్తే.. ఇప్పుడు 88 సీట్లు గెలిచామని తెలిపారు. 47 శాతం ఓట్లతో 75 శాతం సీట్లు సాధించామని తెలిపారు. కాంగ్రెస్ నేతలకు బుర్రలు పని చేయడం లేదు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పుకు కాంగ్రెస్ నేతలకు దిమ్మతిరిగింది. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేసే పరిస్థితి లేదన్నారు. పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేలా పని చేయాలని కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు.

మరో మహిళ..!

(మొదటిపేజీ తరువాయి)

మూడో మహిళ అయ్యప్పను దర్శనం చేసుకున్నట్లయింది. ఇంతకుముందు బిందు, కనకదుర్గ అనే ఇద్దరు మహిళలు బుధవారం నాడు అయ్యప్ప దర్శనం చేసుకున్న విషయం తెలిసిందే. పోలీసులు విడుదల చేసిన సీసీటీవీ పుటేజిని బట్టి చూస్తే.. శ్రీలంక మహిళ ఆలయం లోపలకి ఇరుముడి తీసుకుని వెళ్లి తన తల మీద మోసుకెళ్లిన ప్రసాదాన్ని అక్కడ సమర్పించినట్లు తెలుస్తోంది. తాను ఆలయానికి వెళ్లే 18 బంగారుమెట్ల వరకు వెళ్లినపుడు పోలీసులు తనను ఆపారని, తర్వాత ఎలాగోలా లోపలకు వెళ్లి దర్శనం చేసుకుని వచ్చానని శశికళ (46) మీడియాకు తెలిపారు. గత సంవత్సరం సెప్టెంబరులో అన్ని వయసుల మహిళలూ అయ్యప్ప దర్శనం చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత 50 ఏళ్లలోపు మహిళలు దర్శనానికి వస్తే భక్తులు వారిని అడ్డుకుని తిప్పి పంపేస్తున్నారు. కానీ కొంతమంది మాత్రం ఎలాగైనా దర్శనం చేసుకోవాలని పట్టుదలతో ముందుకు వస్తున్నారు. పోలీసులు తనను తొలుత దర్శనానికి వెళ్లనివ్వలేదని, అయితే.. ఆ తర్వాత తన వద్ద ఉన్న మెడికల్ సర్టిఫికెట్ వారికి చూపించానని శశికళ తెలిపారు. ఆమె వద్ద ఉన్న మెడికల్ సర్టిఫికెట్ ప్రకారం.. ఆమె గర్భసంచిని తొలగించారు. అంటే హిస్టరెక్టమీ ఆపరేషన్ జరిగింది. అలా గర్భసంచి తొలగించిన





మహిళలకు రుతుస్రావం జరగదు. అందువల్ల తాను ఆలయ దర్శనానికి అవసరమైన నిబంధనలకు లోబడే ఉన్నానని, 48 రోజుల పాటు ఉపవాసం చేసి మరీ దర్శనానికి వచ్చానని ఆమె తెలిపారు. అయ్యప్ప ఘోటక బ్రహ్మచారి కాబట్టే 10 నుంచి 50 ఏళ్ల వయసు మధ్య ఉన్న మహిళలను ఆలయంలోకి అనుమతించరని అక్కడి పూజారులతో పాటు చాలామంది భక్తులు గట్టిగా నమ్ముతారు.

ఇద్దరు మహిళలను ఆలయంలోకి అనుమతించిన వ్యవహారంపై బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా నిరసనలు తెలుపుతున్నాయి. రాళ్లు, నాటుబాంబులతో కూడిన జనాల గుంపులు కేరళ వీధుల్లోకి వచ్చి గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బంద్ పాటించాయి. పోలీసులతో ఘర్షణపడి.. దుకాణాలను బలవంతంగా మూయించి అధికారపక్షమైన సీపీఎం, దాని మిత్రపక్షాల కార్యాలయలపై కూడా దాడులు చేశారు. హిందూ సంస్థలన్నింటితో కూడిన శబరిమల కర్మసమితి, అంతర్రాష్ట్రీయ హిందూ పరిషత్‌ల పిలుపు మేరకు బంద్ జరిగింది. కాంగ్రెస్ పార్టీ 'బ్లాక్ డే' పాటించగా, ప్రతిపక్ష బీజేపీ కూడా వారికి మద్దతు పలికింది. ఇద్దరు మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం వల్లే వాళ్లు దొడ్డిదోవన ఆలయంలోకి ప్రవేశించారని, ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు బీజేపీ రాజ్యసభ సభ్యుడు వి. మురళీధరన్ విజ్ఞప్తి చేశారు. అయితే తాము మాత్రం సుప్రీంకోర్టు ఉత్తర్వులను అనుసరించే ఇద్దరు మహిళలకు భద్రత కల్పించామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెబుతున్నారు. గురువారం నాటి బంద్ సందర్భంగా 700 మందిని అరెస్టుచేయగా, 600 మందిని ముందు జాగ్రత్తగా అదుపులోకి తీసుకున్నారు.



రాష్ట్రంలో డిఫెన్స్ మ్యూజియం!

యుద్ధ విమానాలు, జలాంతర్గాముల ప్రదర్శన

ఏర్పాట్లు చేస్తున్న పర్యాటక శాఖ

రక్షణ శాఖకు లేఖ రాసిన బుర్రా వెంకటేశం

రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న డిఫెన్స్ మ్యూజియంలో ప్రదర్శన కోసం యుద్ధవిమానం, జలాంతర్గాములను ఇవ్వాలని రక్షణ శాఖను కోరింది. ఈ మేరకు పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం రక్షణ శాఖకు లేఖ రాశారు. తెలంగాణ యువతను రక్షణ దళాల్లో చేరేవిధంగా ప్రోత్సహించడానికి ప్రభుత్వం డిఫెన్స్ మ్యూజియం ఏర్పాటు చేయ నుంది. డీఆర్‌డీఓ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌ను పర్యాటక శాఖ తుపాలోవ్-టీయూ 142 యుద్ధవిమానాన్ని ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో డిఫెన్స్ మ్యూజియంలో రక్షణ దళాలకు చెందిన సామగ్రి, యుద్ధవిమానాలు, ట్యాంకులు, క్షిపణులు, ఆయుధాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

ఒక్క నిమిషంలో వాయిదా



(మొదటిపేజీ తరువాయి)

వాదనలు వినకముందే.. కేవలం 60 సెకండ్లలో అంటే ఒక్క నిమిషంలోనే కేసును వాయిదా వేశారు. కొత్తగా వేరే ధర్మాసనం ఈ అంశంపై జనవరి 10వ తేదీన కేసు చేపడుతుందని, ఈ లోపు ఆ ధర్మాసనంలో ఎవరెవరు ఉండాలో నిర్ణయిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గొగోయ్ తెలిపారు. ఆ రోజున ఈ కేసు విచారణ ఎప్పటినుంచి ప్రారంభం అవుతుందో కొత్త ధర్మాసనంలోని న్యాయమూర్తులు చెబుతారని జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్‌కే కౌల్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. అలహాబాద్ హైకోర్టు 2010లో ఇచ్చిన తీర్పును సవాలుచేస్తూ 14 అప్పీళ్లు పెండింగులో ఉండటంతో వాటి విచారణకు త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటుచేసే అవకాశం ఉందని న్యాయనిపుణులు చెబుతున్నారు. వివాదంలో ఉన్న మొత్తం 2.77 ఎకరాల భూమిని సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహి అఖాడా, రామ్ లల్లాలకు ముగ్గురికీ సమానంగా పంచాలని అలహాబాద్ హైకోర్టు తన ఉత్తర్వులలో పేర్కొంది. జనవరి తొలివారంలో తగిన బెంచి ఈ కేసును విచారిస్తుందని గత సంవత్సరం అక్టోబరు 29న తెలిపింది. అయితే ఈ కేసును అత్యవసరంగా విచారించాలంటూ మరో పిటిషన్ దాఖలు కాగా, తాము ఇప్పటికే దీనికి సంబంధించి ఒక తేదీ చెప్పామంటూ ఆ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అఖిలభారత హిందూ మహాసభ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ కేసులో అసలు కక్షిదారులలో ఒకరైన ఎం. సిద్దిఖ్ వారసులు దాఖలుచేసిన అప్పీలులో హిందూ మహాసభ కూడా ఒక పార్టీ. మసీదు అనేది కేవలం ఇస్లాం మతానికి మాత్రమే సంబంధించినది కాదంటూ 1994లో తాము ఇచ్చిన తీర్పును ఐదుగురు జడ్జీలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి పంపేందుకు త్రిసభ్య ధర్మాసనం సెప్టెంబరు 27న 2:1 తేడాతో నిరాకరించింది. ఇప్పుడు సుప్రీంకోర్టు మరో వారం రోజులకు కేసును వాయిదా వేయడం, అప్పుడు కొత్త ధర్మాసనం వస్తుందని చెప్పడంతో విచారణ మరింత ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

ఉద్యోగాల జాతర



విజయవాడ, జనవరి 4: నిరుద్యోగులకు శుభవార్త. త్వరలో మరిన్ని ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇప్పటికే జారీచేసిన నోటిఫికేషన్లతో పాటు ఈ నెలాఖరులోగా మరో 14 నోటిఫికేషన్లు విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. వీటిద్వారా 1500 ఉద్యో గాలను భర్తీ చేయనున్నారు. ఈ విషయాన్ని ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉద య భాస్కర్ శుక్రవారం మీడియాకు తెలిపారు. గతేడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు డిసెంబర్ 31లోపు నోటిఫికేషన్లు ఇచ్చామని ఆయన చెప్పారు. మొత్తం 21 నోటిఫికేషన్ల ద్వారా 3250 ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. శుక్రవారం విజయవాడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తాము విడుదల చేసిన నోటిఫికేషన్లలోనే స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్స్ పరీక్షల తేదీలతో పాటు ఖాళీల వివరాలను సైతం గతంలో కంటే భిన్నంగా క్యారీ ఫార్వర్డ్ పోస్టుల వివరాలతో సహా పొందుపరిచామని వివరించారు. ఈ నెలాఖరు లోపు 1500 ఉద్యోగాల భర్తీకి మరో 14 నోటిఫికేషన్లు విడుదల చేసే అవకాశం ఉందని వెల్లడించారు.

త్వరగా దరఖాస్తు చేసుకోండి

గతంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించి అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టులకు 47,001 దరఖాస్తులు, ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉద్యోగాలకు 16,130, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలకు 5411, హార్టికల్చర్ అధికారి ఉద్యోగాలకు 1307 దరఖాస్తులు అందాయని తెలిపారు. మిగతా నోటిఫికేషన్లకు దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి ఉద్యోగాలకు ఈ నెల 19 వరకు దరఖాస్తులకు గడువు ఉందని, ఇప్పటివరకు ఆ ఉద్యోగాలకు మొత్తం 56,621 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. అభ్యర్థులు చివరి నిమిషంలో దరఖాస్తులు చేస్తుండటం వల్ల సర్వర్‌లో సాంకేతిక ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. వీలైనంత త్వరగా దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులకు ఎక్కువగా ఓటీపీ సంబంధిత ఇబ్బందులే వస్తున్నాయని, వారికి ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు.



సైకిల్ ఢీకొని.. కారు తుక్కు తుక్కు!

బీజింగ్, జనవరి 4: చైనా సోషల్ మీడియా వెబ్‌సైట్లలో ఒక ఫొటో వైరల్‌గా మారింది. కారు – సైకిల్ ఢీకొన్న ఫొటో అది. సాధారణంగా ఈ ప్రమాదం గురించి చదవగానే ఎవరైనా అనుకునేది సైకిల్ తుక్కు తుక్కు అయి ఉంటుందని. కానీ, అందుకు భిన్నంగా ఇక్కడ కారు ముందుభాగం సొట్ట పడి.. లోపలకు వంగిపోయింది. దాన్ని చూసినవాళ్లంతా ఈ సైకిల్ దేంతో తయారుచేశారంటూ విస్తుపోతున్నారు. ఈ ప్రమాదానికి కారణమైన సైకిల్ మాత్రం చెక్కుచెదరకుండా అలాగే ధీమాగా నిలబడి ఉంది. సీజీటీఎన్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ ప్రమాదం దక్షిణ చైనాలోని షెంజెన్ నగరంలో జరిగింది. దీనికి సంబంధించిన వీడియో కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. దీనికి సంబంధించి ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాలలో జోకులు పేలుతున్నాయి. నోకియా వాళ్లు సైకిళ్లు కూడా తయారుచేస్తున్నారా.. అని ఒకరు కామెంట్ చేస్తే, తనకా సైకిల్ కావాలని మరొకరు అన్నారు. చాలామంది ఇది ఫేక్ బొమ్మ అయి ఉంటుందని, కావాలని ఎవరో ఫొటోషాప్‌లో మార్చి ఉంటారని అనుకున్నా.. స్థానిక పోలీసులు మాత్రం ఈ ప్రమాదాన్ని నిర్ధరించారు. ప్రమాద స్థలం నుంచే వాళ్లు ఒక వీడియో కూడా విడుదల చేశారు. సైకిల్ ఢీకొట్టగానే కారు ముందువైపున్న బంపర్ లోపలకు వెళ్లిపోవడం అందులో స్పష్టంగా కనిపించింది. ఈ ఫొటో ఎడిట్ చేసింది గానీ, మార్చింది గానీ కాదని చెప్పారు. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ తీవ్రగాయాలు కాలేదు. సైకిల్ నడుపుతున్న వ్యక్తికి మాత్రం కొద్దిపాటి గాయాలయ్యాయని అంటున్నారు.

రిటైర్డ్ ఏఎస్పీ విజయకుమార్ మృతి

అనారోగ్యంతో హైదరాబాద్‌లో కన్నుమూత

విజయవాడ, జనవరి 4: ఇంటలిజెన్స్ అడిషనల్ ఎస్పీగా పదవీ విరమణ చేసిన లక్కరాజు విజయకుమార్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం హైదరాబాద్ యశోదా ఆసుపత్రిలో మరణించారు. 1978లో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విజయకుమార్ కెరీర్ ప్రారంభించారు. అనంతరం పలు చోట్ల ఎస్సైగా, సీఐగా పనిచేసి పదోన్నతి పొందారు. సంచలనాత్మక ఆయేషా మీరా హత్య కేసు విచారణలో ఆయన కీలకంగా వ్యవహరించారు. విజయవాడ ఇంటలిజెన్స్ అడిషనల్ ఎస్పీగా పదవీ విరమణ చేశారు. తన కెరీర్‌లో కార్యదక్షత, క్రమశిక్షణతో పనిచేసి పైఅధికారుల మన్ననలు పొందారు.

పార్లమెంట్ సమరానికి సన్నద్ధం కండి



(మొదటిపేజీ తరువాయి)

ఈ నెల 8 లోగా పీసీసీ స్థాయిలో 5 కమిటీలు ఏర్పాటు చెయ్యాలని, అందులో కో ఆర్డినేషన్ కమిటీ, ప్రదేశ్ ఎన్నికల కమిటీ , ప్రచార (క్యాంపెయిన్ కమిటీ), పబ్లిసిటీ కమిటీ, మీడియా కోఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చెయ్యడమే గాక ఈ నెల 15 లోగా కార్యాచరణకు దిగేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంస్థాగతంగా పీసీసీ, డీసీసీ, నగర కమిటీలు, బ్లాక్ ,వార్డు కమిటీలను కూడా ఈ నెల 15 లోగా వెయ్యాలని, బూత్ కమిటీల ఏర్పాటుకు సైతం ఈ నెల 30 కి గడువు విధించింది. కొత్తగా బూత్ లెవల్ కమిటీల నియామకానికి సంబంధించి సమగ్ర సమాచారంతో కూడిన పూర్తి వివరాలను ఫార్మాట్ రూపంలో ఫిబ్రవరి 5 లోగా ఎఐసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శికి పంపించాలని, అదే విధంగా ఓటరు లిస్ట్ విషయంలో కూడా జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించింది. గతంలో చేసిన పొరపాట్లు చెయ్యొద్దని సూచించింది. ఓటరు జాబితాలో చేర్పులకు సంబంధించి బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి ఆ జాబితాను 25 తేదీలోగా ఎన్నికల సంఘానికి సమర్పించాలని కోరింది. అలాగే, ఎన్నికలు సమీపిస్తున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని టీపీసీసీ కమిటీలలో ఉన్న కార్యనిర్వాహక అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులకు ప్రత్యేకంగా పని విభజన చేసి బాధ్యతలు అప్పగించాలని ఆదేశించింది. ప్రతి పీసీసీ కమిటీల్లో 5 మందితో ఎన్నికల మేనేజిమెంట్ కమిటీని ఏర్పాటు చెయ్యాలని, ఆ కమిటీలు డీసీసీలు, ఏఐసీసీ కమిటీలతో పనుల బాధ్యతల విషయంలో సమన్వయం చేసుకోవాలని కోరింది. పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి పీసీసీ కమిటీలు సమావేశాలు నిర్వహించడమే గాక, డీసీసీల నుంచి సిఫార్సులు స్వీకరించాలని ఆదేశించింది. ఈ నెల 15 న పీసీసీ స్థాయిలో ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించానలి , శక్తి ఆప్‌కు అత్యంత ప్రాధాన్యత ఇ స్తూ సభ్యత్వ నమోదుతో పాటు ఇతర కార్యక్రమాలను పూర్తి చేయాలని విజ్ఞప్తిచేసింది. లోక్‌సభ ఎన్నికలకు ప్రణాళికాబద్ధంగా వెళ్లాలని, పీసీసీ చీఫ్‌కు సంబంధిత పనులలో సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కూడా ఏఐసీసీ కోరడం విశేషం. ప్రచార ప్రణాళిక, మేనిఫెస్టో ఇతర అంశాలకు సంబంధించి పనులను పూర్తి చెయ్యడంలో జాప్యం చెయ్యొద్దని కూడా ఎఐసీసీ హెచ్చరించింది.



అసెంబ్లీకి పోటీ చేసిన అభ్యర్థులే పంచాయతీ, పార్లమెంట్

ఎన్నికల బాధ్యులు

- ఓటర్ల నమోదులో ప్రత్యేక శ్రద్ధ చూపాలె
- లోక్‌సభ నియోజకవర్గాల సమీక్షలో ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 04(మనంప్రతినిధి) : శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులే తమ నియోజకవర్గాల పంచాయతీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలకు కూడా ఇంచార్జీలుగా వ్యవహరిస్తారని టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, శాసనసభ ఎన్నికల్లో ఓటమిపై శుక్రవారం గాంధీభవన్‌లో లోక్‌సభ నియోజకవర్గాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదిలాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్, కరీంనగర్, జహీరాబాద్, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన నేతలు, ఇంచార్జీలు పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర ఇంచార్జీ డాక్టర్ రామచంద్రకుంతియా, ఎఐసీసీ కార్యదర్శి శ్రీనివాసన్, శాసనమండలిలో విపక్ష నాయకుడు మహ్మద్ అలీ షబ్బీర్ కూడా ఈ సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 14 వ తేదీలోగా బూత్ లెవల్, బ్లాక్ స్థాయిల్లో కమిటీలు వేయాలని ఉత్తమ్ ఆదేశించారు. ఓటర్ల నమోదు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు వహించాలని సూచించారు. నకిలీ ఓటర్లను చేర్పించేందుకు అధికార టీఆర్ఎస్ పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు మీడియా దృష్టికి తేవడంతోపాటు ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చెయ్యాలని కోరారు. ఎఐసీసీ ఆదేశాల మేరకు 33 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను నియమించే ప్రక్రియను చేపడుతున్నట్లు చెప్పారు. అసెంబ్లీకి పోటీ చేసిన అభ్యర్థులు డీసీసీలకు పేర్లను సిఫార్సు చెయ్యాలని ఉత్తమ్ సూచించారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు పొన్నంప్రభాకర్, జెట్టి కుసుమకుమార్, పార్టీ నేతలు మృత్యుంజయం, రమేష్ రాథోడ్, విజయరమణారావు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

- బీసీ రిజర్వేషన్ల తగ్గింపుతో టీఆర్ఎస్ కనుమరుగు
- పంచాయతీల్లో రిజర్వేషన్ల పెంపునకై ఉద్యమాలు
- టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ చిత్తరంజన్‌దాస్

హైదరాబాద్, జనవరి04(మనంప్రతినిధి) : పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గించడంతో వెనుకబడిన వర్గాల ఆగ్రహాన్ని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ చవిచూడక తప్పదని టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ చిత్తరంజన్ దాస్ హెచ్చరించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఓబీసీ సెల్ సమావేశం నిర్వహించారు.అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగెస్ పార్టీ పంచాయతీ ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే వాటిని 22 శాతానికి తగ్గించడం సరికాదని, దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు మెజారిటీ సీట్లు కేటాయించాలని తమ సమావేశంలో తీర్మానించినట్లు చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధానిని చెయ్యడమే తమ లక్ష్యమని, ఫిబ్రవరిలో ఢిల్లీలో జాతీయ బీసీ గర్జనను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కేసీఆర్ తమకు అన్యాయం చెయ్యాలని చూస్తే ఆయన పతనానికి దారి తీస్తుందని హెచ్చరించారు. సమగ్ర సర్వే ఒక్కరోజులో చేసిన కేసీఆర్ సర్కార్, బీసీ జనాభా ఎంతో ఎందుకు సర్వే చెయ్యడం లేదని చిత్తరంజన్ దాస్ ప్రశ్నించారు. బీసీ వర్గాలను బలహీన పర్చేందుకు జరుగుతున్న కుట్రలో భాగంగానే బీసీ రిజర్వేషన్ల తగ్గింపు జరిగిందని మండిపడ్డారు.



బీసీలపై కేసీఆర్‌కు ప్రేమ ఉంటే రివ్యూ పిటిషన్ ఎందుకు వెయ్యలేదు: షబ్బీర్ అలీ



వెనుకబడిన వర్గాలపై నిజంగా కేసీఆర్‌కు ప్రేమ ఉంటే హైకోర్టులో రిజర్వేషన్లపై ఎందుకు రివ్యూ పిటిషన్ దాఖలు చెయ్యలేదని శాసన మండలిలో విపక్ష నాయకుడు మహ్మద్ అలీ షబ్బీర్ ప్రశ్నించారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 50శాతం రిజర్వేషన్ల పరిమితి ఆర్డినెన్స్ తీసుకువచ్చి ఈ వర్గాలకు కేసీఆర్ ద్రోహం చేశారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ప్రజలు తీర్పు ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రజలకు ఇచ్చిన హామీల అములులో తీవ్రంగా విఫలమయ్యారని అందుకేరాహుల్‌గాంధీ వైపు ప్రజలు చూస్తున్నారని చెప్పారు. శాసనసభ ఎన్నికల్లో ఓటమిని సమీక్షించుకుంటున్నామని, తమ పరంగా తప్పులు ఉంటే సవరించుకుంటామని షబ్బీర్ అలీ చెప్పారు.

దళితులను వెలివేసిన అగ్రకుల పెత్తందారులను అరెస్టు చేయాలి

హైదరాబాద్, జనవరి 4 (మనం ప్రతినిధి) : దళితులను వెలివేసిన అగ్రకుల పెత్తందారులను తక్షణం అరెస్టు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాల మహానాడు అధ్యక్షులు మట్టారాజుతో కలిసి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్‌లోని నందిపేట మండలం మారంపల్లి గ్రామంలో మాల సామాజిక వర్గం గ్రామ శివారులోని చెరువు కట్ట కింద అంబేద్కర్ కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు పునాదులు వేయగా గ్రామంలోనే అగ్రకులాలు అడ్డుకుని 80మంది మాల కుటుంబాలను సాంఘీకంగా వెలివేశారన్నారు. 50వేలు రూపాయల జరిమానా కట్టించుకుని వెలిని రద్దు చేయలేదని ఆరోపించారు. బాధితుల్లో ఒకరు ఘటనకు నిరసనగా తీవ్రంగా చలించిపోయి మూతికి ముంత ముడ్డికి ముంత కట్టుకుని సుందరయ్యపార్కు, హైకోర్టు, ట్యాంక్ బండ్ వద్ద నిరసన తెలిపాడు. ఈనిరసనను చూసిన దళిత నేతలు సంఘీ భావం తెలిపారు. ఈసందర్భంగా మారు ప్రసంగిస్తూ ఆధునికి రాజ్యంలోను దళితులపై వెలివేతలు కొనసాగడం సిగ్గుచేటన్నారు. ఆప్రాంత పోలీసులు అగ్రకుల దోషులతో కుమ్మక్కై దళితులకు ద్రోహం చేశారని మండిపడ్డారు. జిల్లా కలెక్టరు,ఎస్పీ తక్షణమే స్పందించి బాధిత ప్రాంతాన్ని పర్యటించాలని డిమాండ్ చేశారు.బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. వెలివేతకు వ్యతిరేకంగా అగ్రకులపై ప్రతిఘటన దాడులకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



టీఎన్జీవో కేంద్ర సంఘం 2019 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన హోంమంత్రి



హైదరాబాద్,జనవరి 04, (మనం ప్రతినిధి):తెలంగాణ ఎన్జీవో కేంద్ర సంఘం 2019 డైరీ, క్యాలెండర్ ను హోంమంత్రి మహమ్మద్ మహమూద్ అలీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హోంమంత్రిచేతుల మీదుగారవీంద్రభారతిలో టీఎన్జీవో కేంద్ర సంఘం డైరీ, క్యాలెండర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర, కేంద్ర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు



హైదరాబాద్, జనవరి 04,(మనంప్రతినిధి): తెలంగాణ, హోంమంత్రి మహమ్మద్ మహమూద్ ఆలీని తెలంగాణ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ క్యాడర్, అసోసియేషన్ సభ్యులు సచివాలయంలోని హోంమంత్రి ఛాంబర్‌లో మహమూద్ అలీని శుక్రవారం కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు హోంమంత్రిని తెలంగాణ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ క్యాడర్ అసోసియేషన్ సభ్యులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ శైలజ, సెక్రెటరీ నరేష్ కుమార్, టీజీవోస్ ఫోరమ్ ప్రెసిడెంట్ పి. కృష్ణ మూర్తి, డిప్యూటీ డైరెక్టర్ రంగారెడ్డి రాము పాల్గొన్నారు.

హోంగార్డ్సు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా...



హోంమంత్రి మహమ్మద్ మహమూద్ ఆలీకి తెలంగాణ స్టేట్ హోంగార్డ్సు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్వల్ దయానంద్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పర్మినెంట్, ఆరోగ్యభద్రత వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోనూ తమ సమస్యలపై విన్నవించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ సానుకూలంగా స్పందించిన హోంమంత్రి మహమ్మద్ మహమూద్, ఎమ్మెల్యే హరీష్‌రావులకు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జగన్నాథ్, కిషన్‌నాయక్, సైబరాబాద్ హోంగార్డ్సు అధ్యక్షుడు అశోక్ కుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జంగయ్య, వీరేందర్, దశరథ్, రసమయి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఐఏకు జగన్ కేసు

- విచారణకు అంగీకరించిన కేంద్రం ● కేసు అప్పగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు
- విశాఖ ఎయిర్‌పోర్టులో హత్యాయత్నం ● కోడి కత్తితో దాడి చేసిన శ్రీనివాస్..
- కేసుపై దర్యాప్తును ఆలస్యం చేయద్దు ● సాక్ష్యాధారాలు తారుమారు కావచ్చు
- జగన్ తరఫు న్యాయవాది వాదనలు ● ఎన్ఐఏకు కేసు అప్పగించిన హైకోర్టు

అమరావతి, జనవరి 4: వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం కేసు విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగిస్తూ ఏపీ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసుపై ఏపీ హైకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. ఎన్ఐఏ యాక్ట్ ప్రకారం కేసును ఎన్ఐఏకి బదిలీ చేయాలని వైఎస్ జగన్ తరపు న్యాయవాది గత విచారణలో కోర్టును కోరారు. కేసు దర్యాప్తు మరింత ఆలస్యమైతే సాక్ష్యాధారాలు తారుమారు అయ్యే అవకాశం ఉందని ఆయన కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ కేసును ఎన్ఐఏకి అప్పగించడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు గతంలోనే అడిగి తెలుసుకుంది. ఈ కేసును ఎన్ఐఏకి అప్పగించడంపై కేంద్రం నిర్ణయం తీసుకోకపోతే, తామే తీసుకుంటామని హైకోర్టు తేల్చిచెప్పడంతో కేంద్రం దిగొచ్చి ఎన్ఐఏ విచారణకు అంగీకరించింది.

విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లోని వీవీఐపీ లాంజ్‌లో అక్టోబర్ 25న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై పక్కనే ఉన్న ఫ్యూజన్‌ఫుడ్స్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న శ్రీనివాసరావు కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే.

రక్షణశాఖకు చెందిన తూర్పు నౌకా దళం పర్యవేక్షణలో ఉన్న ఎయిర్‌పోర్ట్‌లో జరిగిన ఈ దారుణ ఘటన వెనుక కుట్ర దాగి ఉందని పలు వర్గాలు అనుమానించాయి. ఎయిర్‌పోర్ట్ భద్రతను పర్యవేక్షిస్తున్న కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) ఉన్నతాధికారులు కూడా ప్రాథమిక విచారణలో ఇదే నిర్ధారణకు వచ్చారు. అయితే ఘటన జరిగిన తర్వాత.. జగన్ అభిమానే ఈ దాడికి పాల్పడ్డాడని, సంచలనం సృష్టించడం ద్వారా సానుభూతి పొందేందుకు చేసినట్లు చెప్పాడని ఆంధ్రప్రదేశ్ పోలీసులు తెలిపారు. దీంతో.. ఈ దాడి ఘటనపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ న్యాయస్థానాన్ని కోరింది. డిసెంబర్ 31న ఈకేసును ఎన్ఐఏకి బదిలీ చేసినట్లు ఏపీ హైకోర్టుకు కేంద్రం తెలిపింది. హోంశాఖ ఆదేశాలతో హైదరాబాద్ ఎన్ఐఏ విభాగం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ప్రధాన విచారణ అధికారిగా మహ్మద్ సాజిద్ ఖాన్‌ను నియమించారు.

మైనర్ ఇరిగేషన్‌కు అవార్డు

హైదరాబాద్, జనవరి 4 (మనం ప్రతినిధి): తెలంగాణ చిన్న నీటిపారుదల శాఖకు ప్రతిష్టాత్మక సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ అవార్డు దక్కింది. సాగునీటి వనరుల నిర్వహణలో మెరుగైన పనితీరునూ ప్రదర్శిస్తూ ,మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్దరణకు పాటు పడుతున్నందుకు అవార్డు లభించింది. శుక్రవారం సాయంత్రం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్యాంసుందర్ ఈవార్డు అందుకున్నారు.

అటవీ నేరగాళ్ల పనిపడుతున్నడాగ్ స్క్వాడ్

హైదరాబాద్, జనవరి 4 (మనంప్రతినిధి): అటవీ నేరాల అదుపుకోసం విన్నూత ప్రయత్నం చేసిన అటవీశాఖ ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. మంచిర్యాల జిల్లా జిన్నారం డివిజన్‌లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన డాగ్ స్క్వాడ్ పని మొదలు పెట్టింది. చింతగూడ పరిధిలో చుక్కల దుప్పిని చంపి, మాంసం విక్రయం కోసం ప్రయత్నించిన నిందితులను అటవీశాఖ డాగ్ స్క్వాడ్ సహాయంతో పట్టుకుంది. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వన్యప్రాణి చట్టం కింద కేసు నమోదు చేసిన అటవీశాఖ వారిని కోర్టులో ప్రవేశపెట్టింది. వేటగాళ్లు దుప్పిని వెంటడారని పసిగట్టిన సిబ్బంది వెంటన్ డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. వాసన పసిగట్టడం ద్వారా అటవీ ప్రదేశం నుంచి వెతుక్కుంటూ వెళ్లిన కుక్క వేటాడిన దుప్పి మాంసం దాచిన ప్రదేశాన్ని నిందితులను కనిపెట్టింది. ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణలో ఇలా డాగ్ స్క్వాడ్ ద్వారా అటవీ నేరగాళ్లను పట్టుకోవడం ఇదే తొలిసారి అని అటవీశాఖ ఉన్నతాధికారులు వివరించారు.

ఇక జనసేన టూర్!

- వందరోజుల పర్యటనకు పవన్ ప్లాన్ ● 175 నియోజకవర్గాలు చుట్టే యోచన
- రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో పర్యటన ● క్యాడర్.. లీడర్ల ఎంపిక కూడా అప్పడే
- పార్టీని జనంలోకి తీసుకెళ్లే ప్రయత్నం ● కొత్త సంవత్సరంలో అమరావతి మకాం
- ప్రధాన నాయకుల బసకూ ఏర్పాట్లు... ● 60-70 స్థానాలలో గట్టిపోటీకి ప్లాన్

ఒంగోలు, జనవరి 4 (మనం న్యూస్ బ్యూరో): సినిమాలు వందరోజులు ఆడితే భారీగా ఫంక్షన్ చేస్తారు. అలాగే సినీ రంగం నుంచి వచ్చిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయాల్లోనూ హండ్రెడ్ డేస్‌ను మర్చిపోయినట్లు లేదు. అందుకే ఆయన వందరోజుల ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. వందరోజుల్లో రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాలను చుట్టి రావాలన్నది పవన్ కల్యాణ్ నిర్ణయం. వంద రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ లోని 175 నియోజకవర్గాలలో పర్యటించాలన్నది పవన్ కల్యాణ్ ప్లాన్. కేవలం పర్యటనలతో సరిపెట్టకుండా ఆయా నియోజకవర్గాల్లో క్యాడర్‌తో పాటు లీడర్లను ఎంపిక చేయాలన్న లక్ష్యంతో పవన్ పర్యటన సాగనున్నట్లు తెలుస్తోంది.

అమరావతికి మకాం మార్చి...

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. తొలుత ఒంటరిగా పోటీచేయాలని భావించినా.. తర్వాత కలసి వచ్చే పార్టీలతో ఎన్నికల గోదాలోకి దిగాలని పవన్ నిర్ణయించారు. సీపీఐ, సీపీఎం, లోక్‌సత్తా లాంటి పార్టీలతో పవన్ జత కట్టనున్నారు. ప్రధానంగా 60 నుంచి 70 నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థులను రంగంలోకి దించి హిట్ కొట్టాలన్నది పవన్ వ్యూహంగా తెలుస్తోంది. అందుకే కొత్త ఏడాది తొలి రోజునుంచే పవన్ తన మకాంను అమరావతికి మార్చేశారు. ఇక ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఏపీలోనే ఉండేలా పవన్ ప్లాన్ చేసుకున్నారు.

175 నియోజకవర్గాల్లో..

ఇప్పటికే పవన్ ఆరు జిల్లాల్లో పోరాటయాత్ర పేరుతో పర్యటనలు చేసి వచ్చారు. కానీ అక్కడ కూడా అన్ని నియోజకవర్గాలను ఆయన టచ్ చేయలేదు. దీంతో మరోసారి 13 జిల్లాల్లో పర్యటించాలని పవన్ ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. వందరోజుల్లో 175 నియోజకవర్గాల్లో పర్యటన కవర్ అయ్యేలా రూట్ మ్యాప్ కూడా ఇప్పటికే సిద్ధం అయినట్లు తెలుస్తోంది. పార్టీ కార్యకలాపాలను పెంచడం ద్వారా ప్రజల్లో పార్టీ పట్ల విశ్వాసం కల్గించాలని పవన్ భావిస్తున్నారు. పార్ట్ టైం పొలిటీషియన్ అనే పేరును చెరుపుకొనేందుకు ఈ ఐదు నెలలు పవన్ శ్రమించనున్నారు.

క్యాడర్ కు చేరువగా....

పార్టీ సిద్ధాంతాలు, మ్యానిఫెస్టోతో పాటు ముఖ్యంగా పార్టీగుర్తు అయిన టీ గ్లాసును కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉంది. జనసేన పార్టీ ప్రధాన కార్యాలయం కూడా విజయవాడలో ప్రారంభమైంది. పవన్ జిల్లాల పర్యటనలకు వెళ్లినా ముఖ్యనేతలు ప్రధాన కేంద్ర కార్యాలయంలో అందుబాటులో ఉండేలా పవన్ చర్యలు తీసుకున్నారు.



క్యాడర్‌కు, నేతలకు నిరంతరం అందుబాటులో ఉండటం, వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వీలుగా కొంతమంది ముఖ్యనేతలను విజయవాడలోనే పవన్ ఉంచుతున్నారు. ఇక పార్టీలోకి ముఖ్య నాయకుల చేరికలపై కూడా పవన్ దృష్టి పెట్టారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన నేతలతో పాటు ప్రధాన పార్టీల నేతలు కూడా జనసేనలోకి వచ్చేందుకు మొగ్గు చూపుతుండటంతో పవన్ వారిని విడతలవారీగా పార్టీలోకి చేర్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తం మీద పవన్ వందరోజుల టూర్ ఏపీలో పొలిటికల్ హీట్‌ను పెంచనుందనే చెప్పాలి.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
శనివారం, జనవరి 5

రాజకీయ అనిశ్చితిః సంకీర్ణాలకు మార్గం


ఎవరు ఏ కూటమిలో పోటీచేస్తారో, ఎవరు ఎటువైపు ఉంటారో అనేది 2019 సార్వత్రిక ఎన్నికలను అసలు సిసలైన అయోమయానికి గురిచేస్తోంది. బీజేపీ కూటమి (ఎన్‌డీఏ)లో ఎవరుంటారో, బీజేపీయేతర కూటమి (యూపీఏ)లో ఎవరు చేరతారో అంతా అనిశ్చితి ఇప్పట్లో తొలిగిపోయే పరిస్థితి కనిపించడం లేదు. ఈ రెండు కూటమిల మధ్యలో మరో కూటమికి అంకురార్పణ జరుగుతున్న సందర్భంలో దానికి 'తృతీయ కూటమి' అని నామకరణం చేసి ఎన్నికల రంగంలోకి దింపే యోచనలో కొన్ని ప్రాంతీయ పార్టీలున్నాయి. దీంతో ఎన్నికల వాతావరణమంతా ప్రస్తుతానికి గందరగోళ పరిస్థితిని సృష్టిస్తోంది. రాజకీయ చిత్ర పటంలో కనిపించే ఒక వాస్తవం ఏమిటంటే ఎన్‌డీఏలో 2014లో భాగస్వాములైన పార్టీలన్నీ ఈసారి 2019లో ఎన్‌డీఏతో చేతులు కలిపే పరిస్థితి మాత్రం లేదు. చాలా పార్టీలు బీజేపీ యేతర పక్షాల కూటమిలో భాగస్వాములయ్యేందుకు సంసిద్ధత వ్యక్తంచేస్తున్నాయి. ఆయా పార్టీల నేతలు ఆ మేరకు తాము బీజేపీ యేతర పక్షాల వైపే నిలుస్తామని ప్రకటించారు. అయితే, 2014లో ఎన్‌డీఏలో లేని జనతాదళ్ (ఎస్) మాత్రం ఈసారి ఎన్‌డీఏలో భాగస్వామిగా మారింది.

ఇటీవల ఉత్తర భారత్‌లో జరిగిన మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను పార్లమెంట్ ఎన్నికలకు ముందస్తు సంకేతాలని కాంగ్రెస్ నేతలు, కొంతమంది రాజకీయ పండితుల అభిప్రాయాన్ని బీజేపీ తోసిపుచ్చింది. అది ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్న ప్రజావ్యతిరేకత మాత్రమేనని, వాస్తవానికి కేంద్రంపై ప్రజా వ్యతిరేకత అనేది లేనేలేదని బీజేపీ అభిప్రాయపడుతోంది. ఏదేమైనా కిందపడినా మాదే పైచేయి అనే తంతుగా బీజేపీ వ్యవహారశైలి ఉంది. అయితే, పై మూడు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోనూ విజయం లభించడంతో కాంగ్రెస్‌లో అనూహ్య ఊపు కనిపిస్తోంది. రాజకీయంగా కాంగ్రెస్‌కు ఈ విజయాలు ఎంతో ఉత్సాహాన్నిచ్చాయనడంలో సందేహం లేదు. అంతమాత్రాన బీజేపీ ఓడిపోయిందని కానీ, వెనక్కి తగ్గిందని కానీ భావించడానికి అవకాశాలు కనిపించడం లేదు. ఎన్నికలకు మరో నాలుగైదు నెలల సమయం ఉండడంతో ఈలోగా పరిస్థితుల్లో గణనీయ మార్పులు సంభవించి తమపార్టీని ఈసారి కూడా గట్టెక్కిస్తాయని బీజేపీ ఆశాభావంతో ఉన్నది.


కేంద్రంలో అధికారం పొందేందుకు ఎప్పటికీ కీలకభూమి పోషిస్తున్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలే ఈసారి కూడా కీలకపాత్ర పోషించనున్నాయి. ఈ రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితి స్పష్టంగా కనిపిస్తోంది. బీజేపీ యేతర కూటమిలో చేరేందుకు ఒక సందర్భంలో అంగీకరించిన బీఎస్‌పీ అధినేత్రి మాయావతి, మాజీ ముఖ్యమంత్రి, ఎస్‌పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అకస్మాత్తుగా యు-టర్న్ తీసుకున్నట్టుగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. మొదటి నుంచి కాంగ్రెస్‌ను ఈ రెండు పార్టీలు వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. బీజేపీ యేతర పక్షాల కూటమి కోసం తీవ్రంగా శ్రమిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత ఎన్.చంద్రబాబు నాయుడు ప్రయత్నాలకు మొదట్లో తలూపిన మాయావతి, అఖిలేశ్ ఇద్దరూ ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ అధినేత ఎన్. చంద్రశేఖరరావుతో కలిసి పయనించేందుకు సిద్ధపడుతున్నారని వార్తలు వస్తున్నాయి.

ఈ అంశంలో మాయావతిపై ప్రతిపక్షాలు అనేక అనుమాన ధృక్కులతో చూస్తున్నాయి. ఆమె ఆదినుంచి బీజేపీ పక్షమేనని అవి భావిస్తున్నాయి. రెండు రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో వెలుపలి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాలకు మద్దతుపలుకుతున్న మాయావతి ఇటీవల జారీచేసిన అల్టిమేటమ్ ఈ అనుమానాలను బలపరిచేవిగా ఉన్నది. ఆ రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పడి పట్టుమని నాలుగు రోజులు కాకముందే అల్టిమేటమ్‌లు జారీచేయడం అభ్యంతరకరమని పలువురు అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. అయితే, ఎన్నికల ముందు ఎస్‌పీ-బీఎస్‌పీలు కలిసి పోటీచేసి, ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌తో చేతులు కలిపే అవకాశాలున్నాయని కొందరు భావిస్తున్నారు. 2014 ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని 80 స్థానాల్లో బీజేపీ ఒక్కటే 73 స్థానాలను సాధించగా, ఈసారి ఎస్‌పీ-బీఎస్‌పీ కలిసి పోటీచేస్తే ఆ ఫలితాలు పునరావృతం కావడం సాధ్యం కాకపోవచ్చునని ఇటీవల జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి. బీఎస్‌పీపై బీజేపీ ఎన్నో ఆశలు పెట్టుకుందనడానికి ఈ మధ్య బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా ఉన్నాయి. రవాణా మార్గంలో ఆకాశ మార్గాలు (ఫ్లై ఓవర్లు) దూరాన్ని తగ్గిస్తాయని అమిత్ షా వ్యాఖ్యానించడం గమనార్హం.

గతంలో మాదిరిగా ఉత్తరభారతదేశంలో పెద్దసంఖ్యలో సీట్లు రావడం కష్టసాధ్యమేనని బీజేపీ అధిష్టానానికి తెలుసు. ప్రజాభిప్రాయం తమకు వ్యతిరేకంగా ఉందని గ్రహించిన బీజేపీనేతలు తమ దృష్టి పశ్చిమబెంగాల్, ఒడిశాలపైకి సారించారు. ఉత్తరభారతంలో జరిగే నష్టాన్ని ఈ రాష్ట్రాలతో భర్తీ చేసుకోవాలని బీజేపీ యోచిస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో మమతాబెనర్జీ హవా, ఒడిశాలో నవీన్ పట్నాయక్ ఛరిస్మాలకు ఖాయంగా గండిపడుతుందని బీజేపీ ఆశాభావంతో ఉన్నది. కేరళలో ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఒకటి రెండు సీట్లు సాధిస్తామని బీజేపీ భావిస్తోంది. రామజన్మభూమి అంశాన్ని న్యాయస్థానం నిర్ణయానికి వదిలేస్తున్నట్టు ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన విషయం విదితమే. దాని స్థానంలో కేరళ అయ్యప్ప దేశాలయ వివాదాన్ని భుజానికెత్తుకోవడం ఆ పార్టీకి కేరళలో కొంత రాజకీయ ప్రయోజనం లభించే అవకాశాలున్నాయని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఏది ఏమైనా దేశంలో ఒకేపార్టీకి మెజారిటీ లభించే పరిస్థితులు కనిపించడం లేదు. 2014కు ముందున్న పరిస్థితులే అంటే కూటమి రాజకీయాలే ప్రధాన భూమిక పోషిస్తున్నందు వల్ల మళ్లీ సంకీర్ణాలుతప్పవని రాజకీయ పండితులు భావిస్తున్నారు. ●



మంచిమాట



అన్నింటికన్నా గొప్పవరం సంతోషంగా ఉండగలగడమే

- కబీర్

స్వయం పాలనకు రంగం సిద్ధం

గ్రామాలలో ప్రజాస్వామ్యం వికసించి, అది స్వయం సమృద్ధి సాధించినప్పుడే జాతి పురోగతమవుతుందని సెలవిచ్చారు మహాత్మా గాంధీ, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలలో స్వయం పాలన బాట పట్టించడం కోసం పంచాయతీ రాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది. అంటే గ్రామాల అభివృద్ధి కొనసాగినప్పుడే రాష్ట్రం దేశం అభివృద్ధి దిశగా పయనిస్తుందని అర్థం. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఆ సమయం ఆసన్నమైనది. ఎన్నో అవాంతరాలను అధిగమించి ఎట్టకేలకు ఎలక్షన్ కమిషన్ రిజర్వేషన్స్ ఖరారు చేసి ఎన్నికలకు సిద్ధమైంది. జనవరి 21, 25, 29న మూడు విడతలుగా నెలలోపే సర్పంచులను నియమించబోతోంది. కానీ ఎన్నుకోబడే వ్యక్తులు ఎలా ఉండాలి? ఎవ్వరిని ఎన్నుకోవాలి? అనే సంగతి సమాజ నిర్మాతలను ఆవిష్కరించే ఓటర్ల పైననే వున్నది.

గతంలో ఎన్నికైన గ్రామ ప్రథమ పౌరుడుగా ఎన్నికైన వారి గురించి, ఎన్నికైన తమ విధులేంటో, గతంలో దేశంలో గ్రామాల అభివృద్ధికి పాల్పడిన గ్రామ ప్రథమ పౌరుల గురించి తెలుసు కుని నిస్వార్థంగా పయనిస్తూ అభివృద్ధి బాట పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. దేశంలో, రాష్ట్రాలలో జరిగే ఎన్ని కలు ఒక ఎత్తయితే గ్రామస్థాయిలో జరి గే ఎన్నికలు మరొక ఎత్తు అనడంలో ఎలాంటి సంశయం అక్కరలేదు. ఎందు కంటే రాష్ట్ర, కేంద్ర నాయకులు ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు ఎంత ఘాటుగా చేసుకున్న వ్యక్తిగతంగా ఒకరి పట్ల మరొకరు స్నేహ భావంతోనే మెలు గుతారు. అదే విషయాన్నీ గ్రామ స్థాయిలో చూసి నట్లయితే ఒకరిపై నొకరు పగలు, ప్రతీకారాలు పెంచు కుంటూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారనడంలో ఎలాంటి అనుమానం లేదు. తమ పార్టీనేమన్నా, పార్టీ నాయకుడినేమన్నా తమ కుటుంబ సభ్యుల కంటే ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ మెలుగుతుంటారు.



అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు నిర్వహించడం కంటే పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం కొంచెం కష్టమని చెప్పక తప్పదు. ఏది ఏమైనప్పటికీ సర్వం సిద్ధమైంది. రిజర్వేషన్స్‌లో తేడాలొచ్చాయని కొంత మంది కోర్టు మెట్లు ఎక్కారు. కానీ కోర్టు సైతం ఎన్నికలు జరపడానికే మొగ్గుచూపుతోంది. అలాంటప్పుడు గ్రామీణ ప్రజలు ఎంతో అప్రమత్తమై నిస్వార్థంతో, గ్రామాభివృద్ధికి పాటుపడే నాయకుడిని ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇప్పుడు జరిగే పంచాయతీ ఎన్నికలలో యువతే కీలకం కానున్నారు. కావున గతంలో రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసి, చరిత్ర సృష్టించిన కొన్ని విషయాలను చూస్తే.

రంగారెడ్డి జిల్లా హాజిపల్లి గ్రామానికి చెందిన గ్రామ ప్రథమ పౌరురాలిగా ఎన్నికై గ్రామంలోని విధులన్ని సిమెంట్ రోడ్లతో నిర్మించి, ప్రతివీధికి భూ అంతర్భాగం ద్వారా మురికి కాలువలు నిర్మించి, ప్రతి ఇంటికి మరుగుదొడ్లు కట్టించి, పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను, గ్రామ పంచాయతీ భవనాన్ని, గ్రంథాలయాన్ని నిర్మించి, 2008లో అప్పటి దేశ ప్రథమ పౌరురాలు (రాష్ట్రపతి) శ్రీమతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా 'నిర్మల గ్రామ పురస్కారాన్ని' అందుకున్నారు. అదే సంవత్సరం నవంబర్ మాసంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి 'శుభ్రం' అవార్డు పొందడం అనేది మిగతా గ్రామ ప్రథమ పౌరులకు నిదర్శనం.

తెలంగాణలోని వరంగల్ జిల్లాలోని గంగదేవి పల్లి, కరీంనగర్ జిల్లాలోని రామచంద్రపురం, నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ గ్రామం, మహారాష్ట్రలోని అహ్మదనగర్ జిల్లాలోని హైవేర్ బజార్‌లో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలిస్తే, గ్రామ సభలను విజయవంతంగా జరిపి, పలు సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతూ, ఆ సభలలో గ్రామంలోని ప్రతి ఒక్కరిని హాజరయ్యేటట్లు చేసి, గ్రామాభివృద్ధికి కృషి చేశారు.

గంగాదేవి పల్లిలో 18 వివిధ రకాల కమిటీలను గ్రామసభ ద్వారా శుద్ధమైన తాగునీరు కమిటీ, పారిశుధ్య కమిటీ, ఆరోగ్య కమిటీ, సమాచార కమిటీలు మొదలగు వాటిని ఏర్పాటు చేసి ఎవరికి ఏ విషయంలో సమస్య వచ్చినా కమిటీలను సంప్రదించి సులభంగా పరిష్కరించుకునే విధంగా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధికి దోహదపడటం జరిగింది.

పాఠశాలకు వెళ్ళే వయసు వచ్చిన బాల బాలికలను పాఠశాలలలో చేర్పించేటట్లు యంత్రాంగాన్ని తయారు చేసి గ్రామంలో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు కృషిచేస్తూ విజయవంతం కావడం, ప్రతి ఇంటికి పరిశుభ్రమైన తాగునీరు అందేటట్లు చూడటం, జనాభా నియంత్రణలో భాగంగా దంపతులను ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలతో చాలని ప్రోత్సహిస్తూ ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్స్ చేయించడం, గ్రామంలోని ప్రతి పసిపిల్లకు ప్రభుత్వం తరుపున అందించే పోలియో చుక్కలు, టీకాలు, వివిధ వ్యాక్సిన్లు సకాలంలో అందరికి అందేటట్లు చూడటం, గ్రామంలోని ప్రతి కుటుంబానికి బ్యాంకులో ఖాతా తెరిచి నగదు నమోదు చేసుకోవడానికి ప్రోత్సహించడం, గ్రామంలో పారిశుధ్యానికి అధిక ప్రాముఖ్యత నిస్తూ, ఎవరికి ఎలాంటి అంటూ రోగాలు రాకుండా జాగ్రత్తా పడటం, గ్రామంలో అందరి తోడ్పాటుతో మద్యపానాన్ని నిషేధించి అభివృద్ధిలో పరుగులు తీసేవిధంగా తీర్చిదిద్దడం అనేది యావత్తు రాష్ట్రానికి ఆదర్శప్రాయంగా నిలిచింది. ఇవే గాకుండా గ్రామాలలో గ్రామ ప్రథమ పౌరులే గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసిన గ్రామాల గురించి తెలుసుకొని, వాటిని ఆదర్శంగా తీసుకుని ఎన్నికైన సర్పంచులు వాటితో సహా, మారుతున్న కాలానుగుణంగా మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, యావత్తు రాష్ట్రంలో ప్రతి గ్రామం అభివృద్ధిలో ఒకరికొకరు పాటుపడుతూ, గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని, దేశాభివృద్ధి జరగాలంటే గ్రామాణాభివృద్ధి కీలకమని ప్రత్యక్షంగా రుజువు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. అంతకంటే ముందు, గ్రామాలలో జరిగే ఈ పంచాయతీ ఎన్నికలలో స్నేహపూరిత పోటీని కలిగి వుండాలే తప్ప, ఒకరిపై ఒకరు వ్యక్తిగతంగా ఛాలెంజ్‌గా తీసుకొని అధిక ధనాన్ని ఖర్చుచేసి, మద్యాన్ని ఏరులై పారిస్తూ, తను నష్టపోయి, ఇతరులను ఇబ్బందులపాలు చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నది.

గ్రామంలోని ప్రజలంతా కలిసికట్టుగా వుండి అభివృద్ధిని కాంక్షిస్తూ వీలైతే ఏకగ్రీవంగా ఎలాంటి ఎన్నికలు లేకుండా నిస్వార్థ పరుడిని, గ్రామ క్షేమం, సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే వ్యక్తులను ఎన్నుకోవడం ఎంతో మంచి పరిణామం. కక్షలు, కుట్రలు లేకుండా, ఎన్నికల అధికారులతో సహకరిస్తూ, పంచాయితీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై వున్నది. ప్రశాంత వాతావరణంలో, మరెంతో ప్రశాంతంగా ఎన్నికలలో పాల్గొంతూ, ఒక మంచి వ్యక్తిని గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నుకొని గ్రామాభి వృద్ధికి దోహదపడాలని ఆశిద్దాం. పల్లెల ప్రగతియే - దేశాభివృద్ధికి సూచిక.

> **"గ్రామంలోని ప్రజలంతా కలిసికట్టుగా వుండి అభివృద్ధిని కాంక్షిస్తూ వీలైతే ఏకగ్రీవంగా ఎలాంటి ఎన్నికలు లేకుండా నిస్వార్థ పరుడిని, గ్రామ క్షేమం, సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే వ్యక్తులను ఎన్నుకోవడం ఎంతో మంచి పరిణామం. కక్షలు, కుట్రలు లేకుండా, ఎన్నికల అధికారులతో సహకరిస్తూ, పంచాయితీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై వున్నది. ప్రశాంత వాతావరణంలో, మరెంతో ప్రశాంతంగా ఎన్నికలలో పాల్గొంతూ, ఒక మంచి వ్యక్తిని గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నుకొని గ్రామాభి వృద్ధికి దోహదపడాలని ఆశిద్దాం. పల్లెల ప్రగతియే - దేశాభివృద్ధికి సూచిక."**

◆ **పోలం సైదులు**
9441930361

కాంతుల సంవత్సరం

పక్షులకు నిలయమైన
పల్లెలు నేటి యుగంలో
అంతరించిపోతున్న
పక్షుల కిలకిల కూని
రాగాలకు స్వస్తి పలకకుండా
జీవవైవిధ్యానికి
ఆహ్వానం పలుకుదాం
పాశ్చాత్య విష
సంస్కృతులను
పాటించే నేటి తరానికి
స్వస్తి పలికి నాటి
ఆచార సంప్రదాయాలకు
ఆచరించే సంవత్సరానికి ఆహ్వానం
సగర్వంగా పలుకుదాం
మద్య మాంసాలకు
స్వస్తి పలికి చేతికొచ్చిన
పంటను చెరిగిపోసి
బంధుజనమంతా
కలిసి చేసే కొత్త పండుగ
నూతన సంవత్సరానికి
ఆహ్వానం పలుకుదాం!

- కమ్మరి శ్రీనివాసచారి
9177324124

సామ్యవాదులూ... ఏం సాధించారు?

హిందువుల మనోభావాలను గాయపరచటం ద్వారా ఈ దేశంలో సామ్యవాదులు ఏం సాధించదలచుకున్నారో అర్థం కావటంలేదు. ముఖ్యంగా శబరిమల ఆలయంలోకి మధ్యవయస్కులైన స్త్రీలను 'మందబలం'తో బలవంతంగా పంపించడం ద్వారా దేశవ్యాప్తంగా హిందువులకు శాశ్వతంగా దూరమయ్యారు. లౌకికవాదం ముసుగులో దేశంలో వివిధ జాతీయ, ప్రాంతీయ పార్టీలు కూడా ముస్లిం, క్రిష్టియన్ సంతుష్టీకరణ విధానాలతో హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరుస్తున్నారు. హిందూధర్మానికి తీరని ద్రోహం చేస్తున్నారు. మసీదుల్లోకి స్త్రీల ప్రవేశంపై, ముస్లిం మతాధికారులుగా స్త్రీల నియామకంపై ఎందుకు పోరాటాలు చేయటం లేదు? ఏకపక్షంగా పురుషుడు మాత్రమే స్త్రీలకు చెప్పే తలాక్ హక్కు ముస్లిమ్ స్త్రీలకు కూడా కల్పించాలని ఎందుకు డిమాండ్ చెయ్యలేకపోతున్నారు? మతంతో సంబంధం లేకుండా పౌరులందరికీ సమానంగా న్యాయం చేయగలిగే ఉమ్మడి పౌర న్యాయ చట్టం కోసం ఎందుకు డిమాండ్ చెయ్యలేకపోతున్నారు? అంటే మీ సమానత్వం నిజం కాదు. కేవలం హిందూ, జాతీయవాదాన్ని విచ్ఛిన్నం చేయటం మాత్రమే మీ లక్ష్యం. అందుకే మీరు దాదాపు శాశ్వతంగా హిందువులను దూరంచేసుకున్నారు. ఇట్లాంటి మీరు రేపు ఎన్నికలలో ఏ మొహం పెట్టుకొని ఓట్లు - నోట్లు (చందాలు) కోసం మా గడపలు తొక్కుతారు? మాలో ఐక్యత లేకపోయినా ఆత్మాభిమానం ఉందన్న సంగతి విస్మరించకండి.


- వీరుభొట్ల పేరయ్యశాస్త్రి, విజయవాడ

దేశానికి వెన్నెముక రైతు

పల్లె సీమలే దేశానికి పట్టు కొమ్మలు వ్యవసాయానికి వెన్నెముక రైతు అన్నాడు మన మహాత్ముడు గాంధీజీ. 'జై జవాన్ జై కిసాన్' అనే నినాదిచ్చారు మన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి. మన మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం 'జై జవాన్ జై కిసాన్, జై విజ్ఞాన్' అనే నినాదమిచ్చారు. రైతుకు మన నాయకులు ఎంతటి గౌరవాన్ని, ప్రాధాన్యతను ఇస్తున్నారన్నదే ప్రధానం. వ్యవసాయం చరిత్ర మానవ చరిత్రలో అతి పెద్ద అంశం. ప్రపంచవ్యాప్త సామాజిక ఆర్థిక ప్రగతిలో వ్యవసాయాభివృద్ధి కీలకాంశం. ప్రపంచంలోని శ్రామికులలో 42% మంది వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారు. సుమారుగా 70% ప్రజలు ఆధారపడిన మనదేశ వ్యవసాయరంగానికి, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తగిన ప్రాధాన్యత లభించింది. మొదటి పంచవర్ష ప్రణాళికలలో వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి రైతులను రక్షించుకోవాల్సిన అవసరాన్ని గుర్తించారు.

ఒకప్పుడు అందరి వృత్తి వ్యవసాయమే. మన దేశంలో, రాష్ట్రంలో సారవంతమైన భూములు, అనుభవజ్ఞులైన కష్టపడే రైతులు, ఆదాయాలు పెరిగిన ప్రజా ప్రభుత్వాలు ఉండి మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లింది. మోతుబరి రైతు అంటే పల్లెల్లో ఒకింత గర్వం, యువకులకు ఎంతో అభిమానం. పారిశ్రామికాభివృద్ధి, మార్కెటింగ్ సౌకర్యాలు వచ్చాక పెద్ద రైతులు చాలా బాగుపడ్డారు. ఎప్పుడయితే దళారి వ్యవస్థ అడుగు పెట్టిందో రైతాంగం తీవ్ర దుర్భిక్ష పరిస్థితులలోకి నెట్టబడ్డది.

అన్ని రంగాలు దినదినాభివృద్ధి సాధిస్తున్నా ఒక్క వ్యవసాయ రంగం మాత్రమే ఎందుకు కుచించుకుపోతున్నది? ఆర్థికాభివృద్ధి ఎగసిపడుతున్నదని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు వ్యవసాయాభివృద్ధిపై నీళ్ళు నమలడం ఎందుకు? ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనుకకు తగ్గకుండా మొండి ధైర్యంతో రైతులు సేద్యం కొనసాగిస్తున్నారు కాబట్టే ఈ మాత్రం అన్నమైనా జాతికి దొరుకుతున్నది. వారు కూడా విరక్తితో ఏడాది కాడిపడేస్తే, దేశంలోని 120 కోట్ల జనాభా గతి అధోగతి కాకతప్పదు. వ్యవసాయ రంగాన్ని ఇతర పరిశ్రమలతో సమానంగా పరిగణించి రైతుకు ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం కల్పించి పెద్ద ఎత్తున నిధులు ప్రవహింపచేస్తే తప్ప ఈ రంగం బతికి బట్టకట్టే పరిస్థితి కనుపించడం లేదని ఎన్నో కమిటీలు ప్రభుత్వాలకు సిఫారసు చేశాయి. వాటి అమలుకు మాత్రం ప్రభుత్వాలు పూనుకోవడం లేదు. రైతు సౌభాగ్యమే తమ ధ్యేయమంటూ ప్రభుత్వాలు జోలపాటలతో రైతుల్ని మభ్యపెడుతున్నాయి. అలుపెరుగని శ్రామికుల్లా రైతులు బతుకు పోరుచేస్తూ జాతికి ఆహారాన్ని అందిస్తుంటే



అధికారంలో ఉన్న ప్రభుత్వాలు వారిని బిచ్చగాళ్ళుగా చేస్తున్నాయి.


వ్యవసాయం కలిసి రాక రైతులు కష్టాల కొలిమిలో కొట్టుమిట్టాడుతున్నారు. భద్రత లేని బతుకులతో కాలం వెళ్ళబుచ్చుతున్నారు. భూమి తల్లిని నమ్ముకున్న రైతులు కూలీలుగా మారుతున్నారు. కనీస గిట్టుబాటు ధర రాకపోయినా కష్టనష్టాలను ఓర్చుకుంటూ, నిరాశ నిస్పృహల మధ్యలో నిరాదరణకు గురవుతూ, ఆకలిని అప్పులనీ అనారోగ్యాలనీ మౌనంగా భరిస్తూ ప్రజలకి అన్నం పెట్టాలనే సదుద్దేశంతో వేరే ఉపాధిని వెతుక్కోకుండా ఆశగా, అమాయకంగా వ్యవసాయం చేస్తూ తమ చెమటను చిందించి, రక్తాన్ని ధారపోసి, జీవితాన్ని పణంగా పెట్టి ఆకలి తీర్చి అన్నదానం చేస్తున్న రైతులకు అభినందనలు. నేల తల్లిని నమ్ముకొని, పలు రకాల ప్రతికూల పరిస్థితులను తట్టుకుంటూ, శ్రమించి పంటలను పండించి దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్నారు వ్యవసాయదారులు.

పాలకులు అంగీకరించినా, అంగీకరించకపోయినా వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విజయవంతమైనాయి. అయినా వాస్తవాలను విస్మరించి, తమని రైతు ప్రభుత్వాలుగా గొప్పలు చెప్పుకుంటున్నాయి. ప్రభుత్వం అందించే రాయితీలు, రుణ మాఫీలు స్వయంగా వ్యవసాయం చేయకుండా ఉన్న భూకామందులకే లభిస్తున్నాయని తెలిసినా ప్రభుత్వం కౌలు రైతుల సమస్యల పట్ల దృష్టి సారించడం లేదు. వ్యవసాయం ద్వారా రోజు గడవని రైతులు, ధరలు పెరిగి ఆహారం సమకూర్చుకోలేకపోతున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చలోకి రాకుండా వాస్తవాలను మరుగు పరచి అప్రధాన సమస్యల్ని ప్రధాన సమస్యలుగా ముందుకు తెస్తూ ప్రజల దృష్టిని మరలుస్తున్నారు. రైతులు, ప్రజలు సమస్యలపై ఆందోళనలు చేపడితే పోలీసు బలగాల సహాయంతో అణిచివేస్తున్నారు. ఇప్పుడు పదిమందికీ అన్నం పెట్టే రైతన్నలు కరువయ్యారు. దేశం ఎంత అభివృద్ధి చెందినా రైతుల కష్టాలు మాత్రం తగ్గడం లేదు. అప్పులు చేసి పంట చేతికొచ్చాక కనీస మద్దతు ధర లేకుండా తెలిసిన పని ఉన్న ఊరుని వదిలేసి పట్టణాలకు వలస కూలీలుగా వచ్చి స్థిరపడుతున్న వారికి వ్యవసాయం చేయడానికి ప్రభుత్వ సహకారం ఉండాలి. భారతీయ వ్యవసాయ క్షేత్రమే ప్రపంచానికి విజ్ఞానం అందించినది. పొలంలో పనిచేసే సమయంలో పాము కాటుకు మృతి చెందడం వంటి ఘటనలు నిత్యం వెలుగులోకి వస్తున్నాయి. ఇటువంటి సందర్భాల్లో మృతి చెందిన రైతుల కుటుంబాలకు సరైన రక్షణ సౌకర్యం లేదు. ఇతర విభాగాల్లో పని చేస్తూ చనిపోతే బీమా సౌకర్యం ఉంది. రైతన్నకు, ఆయనను నమ్ముకున్న కూలీలకు మాత్రం ఎటువంటి చట్టభద్రతను ప్రభుత్వం కల్పించలేదు. ఉపాధి హామీ పథకం వల్ల పేద ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో మనకు తెలిదు కానీ కూలీలు దొరకక రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. పెట్టుబడి పెట్టే వ్యవసాయదారుడి నడ్డి విరిచిన పథకంగా దీనిని చెప్పుకోవచ్చు. యంత్రాలు పెట్టే స్థాయి లేక కూలీలు సరైన సంఖ్యలో దొరకక ఆర్థికంగా చాల నష్టాలు అనుభవించ వలసివస్తోంది. ఎక్కువ ధరకు కూలీలను తెచ్చుకొని పెట్టిన పెట్టుబడికి, వచ్చే రాబడికి సంబంధం లేకుండా ఆర్థికంగా చితికిపోతున్నాడు. వ్యవసాయ రంగానికి ప్రకృతి విధ్వంసం వల్ల కూడా ఆ రంగం గాలిలో దీపంలా మారింది. నాలుగేళ్ల క్రితం వచ్చిన హుద్‌హూద్ తుఫాను సృష్టించిన భీభత్సం ఇంకా మన మనసుల నుండి తొలగక ముందే పెథాయి తూఫాన్ సృష్టించిన భీభత్సం చూస్తూనే ఉన్నాము. అది అటు వెళ్ళగానే గజ వచ్చి ఉత్తరాంధ్రను ఒణికించింది. ఫలితంగా జరిగే నష్టం అపారం. సముద్ర తీరం ఉన్నప్పుడు, వచ్చే అకాల వర్షాలు, వరదలు, తుఫానుల బారినుంచి రైతుల్ని, ప్రజల్ని రక్షించడం ప్రభుత్వాల బాధ్యత. ఫలసాయం చేతికందే దశలో విపత్తుల విధ్వంసానికి రైతుల కష్టార్జితం పొలాలలోనే కుళ్ళి పోతోంది.

దేశంలో అరగంటకొక చావుగంట మోగుతోంది. ప్రకృతి వైపరీత్యాలను నిలువరించడం సాధ్యం కాకపోయినా, వాటి వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంపైన, వాటిని ప్రణాళికా బద్ధంగా ఎదుర్కొని నష్టాలను తగ్గించే శాశ్వత పథకాలను చేపట్టడంపైనా ప్రభుత్వాలు శ్రద్ధచూపడం లేదు. మార్కెట్ హెచ్చు తగ్గుల నుంచి రైతుకు రక్షణ లేదు. వారి ఆర్థిక పరిస్థితిని మె రుగు పరచడానికి ప్రవేశపెట్టిన అరకొర పథకాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి సెజ్‌ల పేరుతో పంట భూముల్ని చేజిక్కించుకుంటూ వారిని వ్యవసాయానికి దూరం చేస్తున్నది. దాంతో సారవంతమైన భూముల్లో కాంక్రీట్ భవనాలు వెలుస్తున్నాయి. ప్రభుత్వ ప్రో త్సాహం లేక, వ్యవసాయం గిట్టుబాటు కాక అనేకమంది రైతులు సొంతభూముల్ని కౌలుకిచ్చి వలసలు పోతున్నారు. కౌలు రైతులు వ్యవసాయం గిట్టుబాటు కాక, యజ మాను లకు కిస్తీలు కట్టలేక కుదేలై అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. బ్యాంకుల రుణాలు వాస్తవంగా వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు కాక భూస్వాములకే చేరుతున్నాయి. బీమా పథకం వీరికి వర్తించడం లేదు. ఫలితంగా గుండె ఆగో, ఆత్మహత్యకు పాల్పడో పిట్టల్లా రాలిపోతున్నారు.

దళారి వ్యవస్థను అదుపు చేయలేక ప్రభుత్వాలు రైతుల ఉసురు తీస్తున్నాయి. ఇటీవల ఒక రైతు ఉల్లి మార్కెటుకు ఒక లోడు లారీతో వచ్చి, అమ్మడానికి ప్రయత్నిస్తే దళారులు అంతా కలిసి సిండికేట్‌గా మారి సరుకు ఎవరినీ కొననివ్వడం లేదు. పాపం ఆకలి వేసి ఉన్న డబ్బులు అయిపోతే భోజనం చేద్దామని షాప్ అతడిని ఒక సంచి ఉల్లిపాయలు కొనమంటే సంచికి 20 రూపాయలు ఇస్తాన్నాడట. సంచిలో 50 కేజీలుంటాయనుకుంటే కేజీ కనీసం అర్ధ రూపాయి కూడా పడలేదు. అదేరోజు పక్కన కేజీ 20 రూపాయలు అమ్ముతుంటే ఆ రైతు పరిస్థితి తలుచుకుంటే ఎంత విషాదమో చూడండి. రైతు లేనిదే రాజ్యం లేదు అన్న సంగతిని ఎవరూ మరవద్దు.

◆ **కాళంరాజు వేణుగోపాల్**
8106204412



మోదీగా వివేక్ ఒబెరాయ్

- త్వరలో 'పీఎం నరేంద్ర మోదీ' బయోపిక్

ముంబై, జనవరి 4: బయోపిక్‌ల సీజన్ నడుస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్‌లో మోదీ పాత్రను బాలీవుడ్ నటుడు వివేక్‌ఒబెరాయ్ పోషించనున్నట్టు అధికారికంగా వెల్లడించారు. ఈనెల 7వ తేదీన మోదీ బయోపిక్ ఫస్ట్ లుక్ విడుదల కానున్నట్టు ఫిలిం ట్రేడ్ అనలిస్ట్ తరణ్ ఆదర్శ్ వెల్లడించారు. గతంలో సరబ్‌జిత్, మేరీ కోమ్ వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన ఒమంగ్ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'పీఎం నరేంద్ర మోదీ' పేరుతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోందని, జనవరి రెండవ వారంలో చిత్రీకరణ ప్రారంభమవుతుందని తరణ్ ఆదర్శ్ ట్వీట్ చేశారు. చిత్ర పోస్టర్‌ను 23 భాషల్లో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ విడుదల చేయనున్నారు. చిత్రంలో ఎక్కువ భాగం గుజరాత్‌లో చిత్రీకరణ చేయనున్నట్టు చిత్ర వర్గాలు వెల్లడించాయి. గత మూడేళ్లుగా ఈచిత్రంపై తాము కసరత్తు చేస్తున్నట్టు దర్శక, నిర్మాతలు వెల్లడించారు.

2 వేల నోటుపై ఇంకా నిర్ణయం తీసుకోలే

- కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్



న్యూఢిల్లీ, జనవరి 4: పెద్ద నోట్ల రద్దు అనంతరం ప్రవేశపెట్టిన రూ.2 వేల నోటు ముద్రణను నిలిపివేశారన్న వార్తలపై కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి సుభాష్ చంద్రగార్గ్ స్పందించారు. 2వేల నోటు ముద్రణ నిలిపివేతపై ఇంకా తాము ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. కావాల్సిన దాని కన్నా ఎక్కువే ప్రభుత్వం వద్ద రూ.2 వేల నోట్లు ఉన్నాయని ట్విట్టర్‌లో వెల్లడించారు. దేశవ్యాప్తంగా చలామణిలో ఉన్న నోట్లలో 35 శాతం రూ.2 వేల నోట్లే ఉన్నాయన్నారు. అయితే రూ.2వేల నోటు ముద్రణను ఆపేశారని వస్తున్న వార్తలపై ఆయన నేరుగా సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం. పన్ను ఎగవేతదారులు, నల్లధనం రూపంలో 2వేల నోట్లను దాచుకుంటున్నారని, దాని కోసమే 2వేల నోటు ముద్రణను నిలిపేశారని, ఆ తర్వాత ఆ నోట్లను మళ్లీ బ్యాంకులే తీసుకునేందుకు చర్యలు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై ఆర్బీఐ మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

రక్షణ లేదా.. బాంబులేస్తాం జాగ్రత్త

- యూపీ బీజేపీ ఎమ్మెల్యే వార్నింగ్



లఖ్‌నవూ, జనవరి 4: భారత దేశంలో తమకు రక్షణ లేదని ఎవరైనా అంటే వాళ్ల మీద బాంబులేసి లేపేస్తామని ఉత్తర ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ బీజేపీ ఎమ్మెల్యే విక్రమ్ సైని బెదిరించారు. ఇలాంటి కబుర్లు చెప్పేవాళ్లు దేశద్రోహులని ఆయన మండిపడ్డారు. ఇలాంటివాళ్లను చట్టం కఠినంగా శిక్షించాలని, తన వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం దేశంలో రక్షణ లేదనేవాళ్లపై బాంబులు వేయాలని ఆయన అన్నారు. వీళ్లు మన జాతి విలువలను గౌరవించకపోతే ఎంచక్కా దేశం వదిలి వెళ్లిపోయి వేరే ఏదైనా దేశంలో స్థిరపడాలని ఉచిత సలహా ఇచ్చారు. తనకు ఒక మంత్రిపదవి ఇస్తే ఇలాంటివాళ్లందరిపై బాంబులు వేస్తానని, ఏ ఒక్కరినీ వదిలేది లేదన్నారు. దేశం పట్ల భక్తి ప్రపత్తులు లేకపోతే ఇక్కడెందుకు ఉండాలని ప్రశ్నించారు. ఇక్కడ రక్షణ లేదని భావిస్తే, రక్షణ ఉన్నచోటుకే పోవాలన్నారు. వాళ్లను ఎవరు ఆపారని ప్రశ్నించారు. తన పిల్లల ప్రాణాల గురించి తనకు ఆందోళనగా ఉందని సీనియర్ నటుడు నసీరుద్దీన్ షా ఒక ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఆయనిలా అన్నారు. ఎమ్మెల్యే విక్రమ్ సైని గతంలో కూడా వివాదాస్పదంగానే ఉన్నారు. గత సంవత్సరం జనాభా నియంత్రణ కార్యక్రమంలో మాట్లాడుతూ, జనాభా నియంత్రణకు చట్టం చేసేవరకు హిందువులు మరింత ఎక్కువ మంది పిల్లలను కనాలని పిలుపునిచ్చారు.

లౌకిక పార్టీలకు కాంగ్రెస్'బిగ్ బ్రదర్'..

- సంకీర్ణంలో బాధ భరించాల్సిందే..
- కుమారుడికి హితవు పలికిన దేవెగౌడ



బెంగళూరు, జనవరి 4: జనతాదళ్ సెక్యులర్ పార్టీ (జేడీఎస్) అధినేత హెచ్‌డీ దేవెగౌడ చేసిన తాజా వ్యాఖ్యలు ఆసక్తిరేపుతున్నాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం సంకీర్ణ కూటమిగా జతకట్టే ముందు ప్రాంతీయ పార్టీలను కాంగ్రెస్ పార్టీ బాగా చూడాలన్నారు. ''లౌకిక పార్టీలకు కాంగ్రెస్ పార్టీ బిగ్ బ్రదర్. మమ్మల్ని ఆ పార్టీ బాగా చూడాలి, లోక్‌సభ ఎన్నికల కోసం కూటమిగా జతకట్టే ముందు ప్రాంతీయ పార్టీలను కాంగ్రెస్ బాగా చూడాలి'' అంటూ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి దేవెగౌడ వ్యాఖ్యానించారు. కర్నాటక సీఎం, తన కుమారుడైన హెచ్‌డీ కుమారస్వామికి కూడా పనిలో పనిగా ఆయన హితవు పలికారు. సంకీర్ణ సర్కారు నడిపే క్రమంలో బాధను కూడా సహించాలన్నారు. ''నేను ఎవరినీ నిందించడం లేదు, సంకీర్ణ కూటమి సర్కారు నడపడంలో కుమారస్వామి పడుతున్న బాధ నాకు తెలుసు, లక్ష్యాన్ని సాధించేందుకు ఆయన దీన్ని భరించాలి, సంకీర్ణంలో ఎదురైన బాధలన్నీ పార్టీ పక్కనకు తోసివేసి, ముందుకు కదలాలి''అంటూ మాజీ ప్రధాని సలహా ఇవ్వడం విశేషం. లోక్‌సభ ఎన్నికలకు సీట్ల సర్దుబాటు విషయంలో 2:1 నిష్పత్తిలో కాంగ్రెస్‌తో సీట్లు పంచుకునే నేపథ్యంలో గౌడ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పలు బోర్డులకు, కార్పొరేషన్లకు పదవులను కాంగ్రెస్ ఏకపక్షంగా కేటాయించడంపై అలకబూనిని జేడీ(ఎస్), సంకీర్ణ ప్రభుత్వమన్న సాకుతో కాంగ్రెస్ తమకు తోచింది చేస్తే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తమ పార్టీకి కేటాయించే 12 ఎంపీ సీట్లలో 11 స్థానాల్లో గెలిచి తీరాలని పేర్కొంది.

భద్రతను గాలికొదిలేశారు



- ఆరోపించే ముందు హోంవర్కు చేయండి
- ఏదో నచ్చనందునే.. ఒప్పందం కుదరలేదు
- డిఫెన్స్ డీల్.. డీల్ ఇన్ డిఫెన్స్‌కు తేడా ఉంది
- కాంగ్రెస్ పార్టీపై నిర్మలా సీతారామన్ ఫైర్

న్యూఢిల్లీ, జనవరి 4: దశాబ్ద కాలం పాటు అధికారంలో ఉన్నప్పుడు రక్షణ పరమైన అంశాలన్నింటినీ గాలికొదిలేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు మాత్రం అబద్ధాలను ప్రచారం చేస్తోందంటూ రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రంగా మండిపడ్డారు. రఫేల్ జెట్ ఫైటర్ల కొనుగోలు వ్యవహారంపై లోక్‌సభలో తీవ్రస్థాయిలో జరిగిన చర్చలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలకు ఆమె దీటుగా సమాధానమిచ్చారు. ఆరోపణలు చేసేముందు కాంగ్రెస్ వాళ్లు తగిన హోంవర్క్ చేసుకుని రావాలని ఎద్దేవా చేశారు. 2014 వరకు దశాబ్ద కాలం పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వాళ్లు అసలు ఫైటర్ జెట్లను కొనాలనే అనుకోలేదని ఆమె ఆరోపించారు. జాతీయ భ ద్రత ముప్పులో ఉన్నా వాళ్లు పట్టించుకోలేదని, వాళ్లకు ఖజానా భద్రతే ముఖ్యంగా మారిందని విమర్శించారు. యూపీఏ హయాంలో డసాల్ట్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకునేటప్పుడు వాళ్లకు 'ఏదో నచ్చలేద'ని నిర్మలా సీతారామన్ ఆరోపించారు. తాము రక్షణ విషయంలో రాజీ పడబోమని.. జాతీయ భద్రతను ప్రాధాన్యంగా భావిస్తామని అన్నారు. ఒకవైపు మన పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్ తమ సామర్థ్యాన్ని విపరీతంగా పెంచుకుంటున్నాయని.. యూపీఏ ప్రభుత్వం కేవలం 18 ఫైటర్ జెట్లు మాత్రమే కావాలని చెప్పి అడ్డంకులు కల్పించిందని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం తక్కువ సంఖ్యలో విమానాలు కొంటోందంటూ కాంగ్రెస్ చేసిన ఆరోపణలను ఆమె తిప్పికొట్టారు. కొత్త ఒప్పందంలో 36 జెట్ విమానాలను ఎగిరేందుకు సిద్ధంగా ఉండే పరిస్థితిలో కొంటున్నామని ఆమె చెప్పారు. తొలి యుద్ధ విమానాన్ని 2019 సెప్టెంబరులో అందజేస్తారని, 2022 నాటికల్లా మొత్తం 36 విమానాలు వస్తాయని వివరించారు. బేరాల ప్రక్రియ మొత్తం 14 నెలల్లో ముగిసిందన్నారు. మోదీ హయాంలో రక్షణ మంత్రిత్వశాఖ మధ్య దళారులు లేకుండా పనిచేసిందన్న నిర్మల.. బోఫోర్స్ స్కాం తప్ప రఫేల్ కాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ చుట్టూ అవినీతి కంపు కొడుతోందని, రఫేల్ కొనుగోళ్లే మోదీని మరోసారి అధికారంలోకి తెచ్చి అవినీతిని అంతమొందించేందుకు ఉపయోగపడతాయని అన్నారు. నాలుగేళ్లుగా తమ ప్రభుత్వం ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేకుండా నడిచిందని గుర్తుచేశారు. పాత ఒప్పందంలో కేవలం ఒక స్క్వాడ్రన్‌కు మాత్రమే ఐదేళ్ల పాటు లాజిస్టిక్స్ మద్దతు ఇచ్చేలా ఉందని, కానీ తమది అదనపు ఖర్చు ఏమీ లేకుండానే రెండు స్క్వాడ్రన్లకు ఇస్తున్నారని చెప్పారు. తమ ఒప్పందంలో ఎక్కడా వాణిజ్యపరమైన పక్షపాతం చూపించలేదన్న విషయాన్ని సుప్రీంకోర్టే స్పష్టం చేసిందని, ధరల వివరాలు, విమానాల ధరలను పోల్చిచూడటం లాంటివన్నీ ఏసిన తర్వాతే ఈ విషయం చెప్పిందని ఆమె గుర్తుచేశారు. విదేశాల నుంచి కొనుగోలుచేసే రక్షణ పరికరాల విషయంలో బ్యాంకు గ్యారంటీలు ఏమీ ఉండవని రక్షణ మంత్రి తెలిపారు. ఈ ఒప్పందంలో కలగజేసుకోడానికి తమకు కారణం ఏమీ కనిపించలేదని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. కాగా, ఈ ఒప్పందం విషయంలో తొలుత కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసిన జాయింట్ సెక్రటరీ కూడా తర్వాత పూర్తిగా చదివి సంతకం చేశారని తెలిపారు. ఆయనతో పాటు ఆరుగురు సభ్యులు కూడా కాంట్రాక్టు బేరాల కమిటీ నివేదికపై సంతకాలు చేశారని అన్నారు. రూ. 526 కోట్లు అన్నది 2007 నాటి ధర అని, 2011 లేదా 2014లో కూడా అదే ధర ఉంటుందా అని రక్షణ మంత్రి ప్రశ్నించారు. ధరలు పెరగడంతో పాటు విదేశీ మారకద్రవ్యం రేట్లలో కూడా తేడాలు వచ్చాయని, ఉత్త విమానం ధరను ఆయుధాలతో కూడిన విమానంతో పోల్చకూడదని.. రూ. 526 కోట్లను రూ. 737 కోట్లతో ఎలా పోలుస్తారని నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు. మోదీని గద్దె దించేందుకు పాకిస్థాన్ సాయం కోరడానికి మీకు సిగ్గులేదా అంటూ



మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ భారతదేశ రక్షణ ఒప్పందాల గురించి విదేశీ నేతల వద్ద చర్చించబోదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఒకరు మార్చి 9న చెప్పారని, కానీ రాహుల్ గాంధీ జూలై 20వ తేదీన చెప్పినదాన్ని బట్టి.. ఆయన ఫ్రాన్సు అధ్యక్షుడిని ఒప్పందంలో రహస్యాలేంటని అడగ్గా అలాంటిదేమీ లేదని ఆయన చెప్పారని.. అంటే ఇప్పుడు వీళ్లిద్దరిలో ఎవరు తప్పు చెబుతున్నట్లని నిలదీశారు. అగస్టా వెస్ట్‌లాండ్ హెలికాప్టర్లను కొనే సమయంలో హెచ్‌ఏఎల్‌ను ఎందుకు వదిలిపెట్టారని ప్రశ్నించారు. హెచ్‌ఏఎల్ ఎలాంటి కమీషన్లు ఇవ్వదనే అలా చేశారన్నారు.

ఇప్పుడు క్రిస్టియన్ మైఖేల్ భారతదేశానికి రావడం చూసి భయపడుతున్నారన్నారు. హెచ్‌ఏఎల్‌కు కాంగ్రెస్ ఏమీ చేయలేదని.. తాము మాత్రం 83 ఎల్‌సీఏ తేజస్‌లు, 15 యుద్ధ హెలికాప్టర్లు, 17 డోర్నియర్ రవాణా హెలికాప్టర్లు.. ఇవన్నీ అక్కడే తయారుచేయించామని నిర్మలా సీతారామన్ చెప్పారు. 2004 నుంచి 2015 మధ్య చైనా 400 యుద్ధ విమానాలు సమకూర్చుకుందని, పాకిస్థాన్ కూడా తమ విమాన సామర్థ్యాన్ని రెట్టింపు చేసుకుందని అన్నారు. 2002లో మనకు 42 స్క్వాడ్రన్లు ఉంటే, 2015 నాటికి అవి 33కు తగ్గాయని చెప్పారు. అందువల్ల ఇప్పటికైనా మన రక్షణ రంగాన్ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. డిఫెన్స్ డీలింగ్స్‌కు.. డీలింగ్ ఇన్ డిఫెన్స్‌కు తేడా ఉందని వ్యాఖ్యానించారు. తాము డిఫెన్స్ డీలింగ్స్ చేయమని అన్నారు. దేశ భద్రతను, ప్రాధాన్యాలను ద ష్టిలో పెట్టుకునే ఒప్పందాలు చేసుకుంటామని అన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, యుద్ధ విమానాల కొనుగోలు దేశ భద్రతకు సంబంధించిన విషయమని అందరు గుర్తుంచుకోవాలన్నారు. 'ఏ ఏ(అనిల్ అంబానీని ఉద్దేశిస్తూ)' కోసమే యుద్ధ విమానాల కొనుగోలు చేశామని కాంగ్రెస్ భావిస్తే, ప్రతి 'ఏఏ' వెనుక ఒక 'క్యూ(ఖత్రోకీని ఉద్దేశిస్తూ)', 'ఆర్‌వి(రాబర్ట్ వాద్రాను ఉద్దేశిస్తూ)' ఉన్నారంటూ నిర్మలా సీతారామన్ విమర్శించారు. 'రఫేల్ మీ హక్కు. దాన్ని మీరే తయారు చేయాలి' అని బెంగళూరు హెచ్‌ఏఎల్ వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై నిర్మలా సీతారామన్ మండిపడ్డారు. హెచ్‌ఏఎల్‌కు ఎందుకు ఇవ్వలేదో రాహుల్‌గాంధీ తెలుసుకోవాలని, హెచ్‌ఏఎల్ గొప్పలే కాదు, లోపాలనూ గుర్తించాలన్నారు. తేజస్ విషయంలో హెచ్‌ఏఎల్ వేగంగా పనిచేయలేదన్నారు. తాము హెచ్‌ఏఎల్‌కు రూ.లక్ష కోట్ల ఒప్పందాలు అప్పగించామన్నారు.

అంబాలా, హషిమారాలో 'రఫేల్'

న్యూఢిల్లీ, జనవరి 4: ఈ ఏడాది సెప్టెంబరులోగా తొలి స్క్వాడ్రన్ (నాలుగు) రఫేల్ యుద్ధ విమానాలు భారత్ వైమానిక దళానికి అందనున్నాయి. తొలిదశలో అందే యుద్ధ విమానాలను హరియాణలోని అంబాలా, పశ్చిమబెంగాల్‌లోని హషిమారా వైమానిక కేంద్రంలో నిలిపి ఉంచనున్నారు. తొలుత వీటికి 1500 గంటల హవర్స్ టెస్టింగ్ నిర్వహించనున్నారు. అనంతరం వీటిని పూర్తిస్థాయిలో ఎయిర్‌ఫోర్స్‌కు అందించనున్నారు.

రఫేల్‌పై విచారణ చేయిస్తాం



- అధికారంలోకి రాగానే ఆదేశాలు
- ఒప్పందలో అవినీతి, అక్రమాలు
- అభ్యంతరాలను తోసిపుచ్చిన మోదీ
- ధరలు పెంచుతూ నిర్ణయించిందెవరు?
- రఫేల్ జెట్ల సంఖ్యను తగ్గించిందెవరు?
- యూరో ఫైటర్ డిస్కౌంట్లను పట్టించుకోలే
- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఫైర్

న్యూఢిల్లీ, జనవరి 4: వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత తాము అధికారంలోకిరాగానే రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై నేర విచారణకు ఆదేశిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రకటించారు. ఈ విచారణ నేర విచారణ తరహాలో ఉంటుందని తెలిపారు. పార్లమెంటు వెలుపల ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తరపున లోక్‌సభలో మాట్లాడుతున్న రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలన్నారు. వేల కోట్ల రూపాయల విలువైన యుద్ధ విమానాల ఒప్పందంపై తాము అనేక ప్రశ్నలు లేవనెత్తామన్నారు. డసాల్ట్ కంపెనీ నుంచి 36 యుద్ధ విమానాలను కొనేందుకు ఒప్పందం కుదుర్చుకోవడానికి రక్షణ మంత్రిత్వ శాఖ అభ్యంతరాలు లేవనెత్తిందా? లేదా? విమానాల ధరను ఎవరు పెంచారు?



చెప్పాలని నిలదీశారు. లోక్‌సభలో రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ మాట్లాడేటపుడు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఓ ప్రకటనలో రఫేల్ ఒప్పందంపై రక్షణ మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిపే ఫైల్ నోటింగ్స్‌ను రాహుల్‌గాంధీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. రఫేల్‌పై మాట్లాడేం దుకు ప్రధాని మోదీ జంకుతూ పారిపోతున్నారని ఆరోపించారు. కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంట్‌లో సుదీర్ఘ ప్రసంగం చేశారని, తనను తూలనాడారని, కానీ తాను లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదన్నారు. ఒక్కో రఫేల్ యుద్ధ విమానం ధర రూ.520 కోట్ల నుంచి రూ.1,600 కోట్లకు చేరిందని, ధరను పెంచుతూ ఎయిర్‌ఫోర్స్, రక్షణ శాఖ లేక ప్రధాని వీరిలో ఎవరు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. అలాగే.. 126 యుద్ధ విమానాలను సమకూర్చుకోవాల్సి ఉండగా.. వాటి సంఖ్యను 36కు ఎవరు తగ్గించారని ప్రశ్నించారు. భారత్‌లో కాంట్రాక్టును అనిల్ అంబానీకి అప్పగిస్తూ ఎవరు నిర్ణయించారన్నారు. కొత్త ఒప్పందంపై చర్చలు జరిపిన బృందం ఏమైనా అభ్యంతరాలు వ్యక్తం చేసిందా? అని ఉంటే అవి ఏమిటో బయటపెట్టాలన్నారు. ఈ ఒప్పందంలో అవినీతితో పాటు.. రఫేల్ కాంట్రాక్టు ను తన స్నేహితుడు అనిల్ అంబానీకి కట్టబెట్టి దేశ భద్రతను మరింత బలహీనం చేసినందుకు ప్రధానిని విచారించాల్సిందేనన్నారు. రఫేల్ ఒప్పందంపై రక్షణశాఖ మంత్రి చెబుతున్న విషయాలను దేశ యువత జాగ్రత్తగా వినాలని సూచించారు. రఫేల్ ఒప్పందంలో అనేక అవకతవకలు, అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నందున పార్లమెంటరీ సంయుక్త సంఘం (జేపీసీ)తో విచారణ చేయించాల్సిందేనని తాము డిమాండ్ చేస్తున్నామని ఉద్ఘాటించారు. రఫేల్ వ్యవహారం అంతా ప్రధాని మోదీ కను సన్నల్లో జరిగిందని, చర్చలు జరిపిన బృందం లేవనెత్తిన అభ్యంతరాలను ఆయన తోసిపుచ్చి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రఫేల్ యుద్ధ విమానాలకు కతార్, ఈజిప్టులు చెల్లించిన వాటికంటే ఎక్కువగా చెల్లిస్తూ ప్రధాని మోదీ ఒప్పందం కుదుర్చుకున్నారని, ఇది దేశ భద్రతపై ఆయన రాజీపడటమేనని అన్నారు. యూరోఫైటర్ డిస్కౌంట్లను కూడా ప్రధాని మోదీ పట్టించుకోలేదన్నారు.

అనిల్ అంబానీకి ఎలా వెళ్లింది?

- రఫేల్ కాంట్రాక్టుపై నిర్మలకు రాహుల్ ప్రశ్న


న్యూఢిల్లీ, జనవరి 4: రఫేల్ విషయంపై రక్షణశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ స్పందించారు. అసలు రఫేల్ యుద్ధ విమానాల తయారీ కాంట్రాక్టు అనిల్ అంబానీకి ఏ విధంగా వెళ్లిందని ఆయన ప్రశ్నించారు. విమానాల ధరలు రహస్యంగా ఉంచాల్సిన అవసరం ఏమీ లేదని ఆయన అన్నారు. రఫేల్ ఒప్పందంలో ప్రధాని మోదీ జోక్యం చేసుకుని తన స్నేహితుడైన అనిల్ అంబానీకి కాంట్రాక్ట్ వచ్చే విధంగా చేశారని ఆయన ఆరోపించారు. 'రఫేల్ విమానాల ధర రహస్యంగా ఉంచే విషయమేమి కాదని మేక్రాన్ చెప్పారు. మేడం(సీతారామన్) నేను మిమ్మల్ని లేదా పారికర్‌ను నిందితులుగా చూపించడం లేదు. ప్రధాని మోదీ ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి. నా ప్రశ్న ఒక్కటే. అనిల్ అంబానీకి ఈ కాంట్రాక్ట్ ఎలా వెళ్లింది. అంబానీకి కాంట్రాక్ట్ ఇవ్వాలని ఎవరు నిర్ణయించారు? రఫేల్ వివరాలను రహస్యంగా ఉంచాల్సిన అవసరమేంటి? భారత ప్రజల సొమ్ము వివరాలను వాళ్లకే తెలియడం లేదు. హెచ్‌ఏఎల్‌కు దక్కకుండా అనిల్ అంబానీ ఈ కాంట్రాక్ట్‌ను ఎలా పొందారు? అని రాహుల్ ప్రశ్నించారు.

ఎన్నికలపై రామాలయం ప్రభావం ఉండదు...

రామాలయం అంశం ప్రభావం సార్వత్రిక ఎన్నికల్లో ఉండబోతోందా అని అడిగినప్పుడు.. నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక విధాన జడత్వం, రాఫెల్ కుంభకోణం వంటి అంశాలు ముందువరుసలో ఉంటాయని రాహుల్‌గాంధీ అన్నారు. ''2019 సార్వత్రిక ఎన్నికల తీరు చాలా స్పష్టంగా ఉండబోతోంది. దేశంలోని యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు, రైతు సమస్యలు, ఆర్థిక వ్యవస్థకు ఎదురవుతున్న ఆటంకాలు, ఆరోగ్యం, విద్య, ఇబ్బడిముబ్బడి అవినీతిలో భాగంగా రాఫెల్ డీల్ పేరుతో తన మిత్రుడు అంబానీకి మోదీ రూ.30,000 కోట్లు కట్టబెట్టడం వంటి అంశాలే ఎన్నికల్లో కీలకం కాబోతున్నాయి' అని ఆయన అన్నారు. రామాలయం అంశం సుప్రీంకోర్టు ముందు ఉందని, అత్యున్నత న్యాయస్థానం ఏం చెబుతుందో చూడాల్సి ఉంటుందని చెప్పారు.

ఢిల్లీ పీసీసీ చీఫ్ పదవికి.. అజయ్ మాకెన్ రాజీనామా

- ఆమోదం తెలిపిన రాహుల్‌గాంధీ
- కొత్త అధ్యక్షుడి కోసం ప్రయత్నాలు



న్యూఢిల్లీ, జనవరి 4: ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి సీనియర్ నాయకుడు అజయ్ మాకెన్ రాజీనామా చేశారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కూడా మాకెన్ రాజీనామాకు ఆమోదం తెలిపినట్లు పార్టీ వర్గాల సమాచారం. ఏఐసీసీ ఢిల్లీ వ్యవహారాల ఇన్‌చార్జి పీసీ చాకోతో కలిసి అజయ్ మాకెన్ రాహుల్ గాంధీ వద్దకు స్వయంగా వెళ్లి తన రాజీనామా లేఖను ఆయనకు సమర్పించారు. తీవ్రంగా కాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నందువల్ల తాను రాజీనామా చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారని తెలుస్తోంది. 2015 అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి ఢిల్లీ కాంగ్రెస్ చైర్మన్‌గా తనకు రాహుల్ గాంధీ నుంచి, పార్టీ కార్యకర్తల నుంచి అపార ప్రేమాభిమానాలు, సహకారం, గౌరవం లభించాయని.. అందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఇంతకుముందు 2018 సెప్టెంబర్‌లో కూడా ఆయన తాను విపరీతమైన కీళ్ల నొప్పులతో బాధపడుతున్నానని, అవి తగ్గేలా లేవని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఇది ప్రాణాంతకం కాదు గానీ నొప్పి బాగా తీవ్రంగా ఉంటోందని చెప్పారు. సెప్టెంబరు నెలలో ఈ సమస్యకు చికిత్స కోసం ఆయన విదేశాలకు కూడా వెళ్లారు. మాకెన్ రాజీనామా చేసినందున ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎవరు సరిపోతారో కొన్ని పేర్లు ఇవ్వాల్సిందిగా పీసీ చాకోను అధిష్ఠానం ఆదేశించింది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్, ఢిల్లీ అసెంబ్లీ మాజీ స్పీకర్ యోగానంద్ శాస్త్రి, జేపీ అగర్వాల్ ఈ పదవికి పోటీలో ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



మణిపూర్‌లో 8 ప్రాజెక్టులు ప్రారంభించిన మోదీ

ఇంఫాల్, జనవరి 4: మణిపూర్‌లో 8 కీలక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. మరో నాలుగు ఇతర ప్రాజెక్టులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఇంటిగ్రేటె డ్ చెక్‌పోస్ట్‌తో పాటు ఇతర సదుపాయాలు కలిగిన రూ.125 కోట్ల ప్రాజెక్టును ఇంఫాల్‌లో జరిగిన ర్యాలీలో మోదీ జాతికి అంకితం చేశారు. ఇంటిగ్రేటెడ్ టూరిస్ట్ డెస్టినేషన్, ఎకో టూరిజం కాంప్లెక్స్, అప్‌గ్రేడెడ్ వాటర్ సప్లై వంటివి మోదీ చేసిన ప్రారంభోత్సవాల్లో ఉన్నాయి. ఇంఫాల్‌లోని ధనమంజరి యూనివర్సిటీ అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పన, హాకీ స్టేడియంకు ఫ్లడ్ లైట్లు వంటి పలు పథకాలకు మోదీ శుక్రవారం శంకుస్థాపనలు చేశారు.



అనుకోకుండానే డైరెక్టర్‌గా మారాను

- కంగనా రనౌత్

కంగనా రనౌత్ టైటిల్ ప్రాతలో నటించిన చిత్రం 'మణికర్ణిక'. జీ స్టూడియోస్ , కమల్ జైన్ నిర్మాణంలో జాగర్లమూడి క్రిష్, కంగనా రనౌత్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం జనవరి 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో కంగనా రనౌత్ మాట్లాడుతూ ''క్యారెక్టర్స్‌కు తెలుగు వాయిస్ అందించిన ప్రతి ఒక్కరూ న్యాయం చేశారు. విజయేంద్ర ప్రసాద్‌గారు కూడా ట్రైలర్ మీద వర్క్ చేశారు. తెలుగులో ఓ పవర్ ఉంటుంది. అందుకే నేను బాహుబలిని తెలుగులో, హిందీలో కూడా చూశాను. నేను ఈ సినిమాను డైరెక్ట్ చేయడమనేది ప్లానింగ్ ప్రకారం జరగలేదు. యాక్సిడెంటల్‌గా జరిగింది. ఆగస్ట్‌లో రావాల్సిన ఈ సినిమాను అనుకున్న సమయంలో పూర్తి చేయలేకపోయాం. ఆ సమయంలో క్రిష్‌గారు మరో ప్రాజెక్ట్ 'యన్.టి.ఆర్' పూర్తి చేయాల్సి ఉంది. కాబట్టి సినిమాను జనవరిలో పూర్తి చేయాలని నేను డైరెక్ట్ చేశాను. క్రిష్‌గారు సినిమాను గొప్పగా తెరకెక్కించారు. ఆయన్ను నేను ఫాలో అయ్యానంతే. టీం సహకారంతో సినిమాను పూర్తి చేశాను. తదుపరి కూడా నేను డైరెక్ట్ చేయాలనుకుంటు న్నాను. ఆ సినిమాకు విజయేంద్ర ప్రసాద్‌గారిని కథను అందించమని చెప్పాను. తప్పకుండా మేం కలిసి పనిచేస్తాం. రెండు నెలలు సినిమా కోసం చాలా కష్టపడ్డాను. మనం కోసం రక్తం ధారపోసిన వారి గురించి పట్టించుకోవడం లేదు. వారు మన చరిత్ర. అలాంటి వారికి గౌరవం ఇవ్వాలి. అలా చరిత్ర మరుగున పడిపోయిన ఎందరో వీరులున్నారు. అలాంటి కారణంతోనే ఝాన్సీ కథను సినిమాగా చేయాలని అనుకున్నాను. ఈ సినిమా మేకింగ్‌లో చాలా సమస్యలను ఫేస్ చేశాం. వాటిని దాటి ఈ నెల 25న సినిమాను విడుదల చేస్తున్నాం'' అన్నారు. నిర్మాత కమల్ జైన్ మాట్లాడుతూ ''ప్రస్తుతం చాలా బయోపిక్స్ రూపొందుతున్నాయి. వాటి సక్సెస్ శాతం కూడా ఎక్కువగానే ఉంది. ఈ సినిమాను చేసే సమయంలో చాలా స్ట్రగుల్స్‌ను ఫేస్ చేశాం. వాటన్నింటినీ దాటి చేసిన సినిమా ఇది. విజయేంద్ర ప్రసాద్‌గారు అద్భుతమైన స్క్రిప్ట్‌ను అందించారు. చాలా మంచి టీం దొరికింది కాబట్టి సినిమాను పూర్తి చేశాం'' అన్నారు.

రీమేక్‌లో చైతన్య!



● నాగ చైతన్య

హిందీలో సూపర్ హిట్ సాధించిన 'బరైలీ కి బర్ఫీ' చిత్రం ఇప్పుడు తెలుగులో రీమేక్ కాబోతోందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రంలో నాగచైతన్య నటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అశ్విని అయ్యర్ తివారి రూపొందించిన ఈ సినిమాలో ఆయుష్మాన్ ఖురానా, రాజ్‌కుమార్ రావు, కృతి సనన్ ముఖ్యపాత్రలు పోషించారు. కేంద్రమంత్రి స్మృతి ఇరానీ, అమితాబ్ బచ్చన్ వంటి ప్రముఖులు ఈ చిత్రాన్ని వీక్షించి ప్రశంసించారు. తెలుగులో రీమేక్ అవబోతున్న ఈ సినిమాను కోన వెంకట్ నిర్మిస్తారని తెలుస్తోంది. ఒక సాధారణమైన కథను తన కథనంతో ప్రేక్షకుల్ని కట్టి పడేశారు దర్శకులు అశ్విని అయ్యర్ తివారి. ఈ సినిమాలో కథనమే ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ సినిమా తెలుగు రీమేక్‌కు ఎవరు దర్శకుడు అనే విషయం ఇప్పటివరకు బయటికి రాలేదు. త్వరలోనే ఆ వివరాలు కూడా తెలుస్తాయి.

అమేజింగ్ ఎక్స్‌పీరియెన్స్



● కియారా అద్వాని

రామ్‌చరణ్, కియరా అద్వాని జంటగా నటించిన చిత్రం 'వినయవిధేయరామ'. బోయపాటి శ్రీను దర్శకుడు. డి.వి.వి.దానయ్య నిర్మాత. సంక్రాంతి సందర్భంగా జనవరి 11న సినిమా విడుదలవుతుంది. ఈ సందర్భంగా కియరా అద్వాని మీడియాతో మాట్లాడుతూ ''దర్శకుడు బోయపాటి శ్రీనుగారు ఈ సినిమా స్టోరీ చెప్పినప్పుడు పూర్తి సినిమా చూసేశాననే ఫీలింగ్ వచ్చింది. చాలా రోజుల తర్వాత ఒక మంచి ఫ్యామిలీ స్టోరీ విన్నాననిపించి ఇమీడియట్‌గా ఓకే చెప్పేశాను. అటు డ్యాన్స్, కామెడీ పెర్ఫామ్ చేయడానికి మంచి స్కోప్ ఉన్న సినిమాలో పని చేసే అవకాశం దొరికినప్పుడు చాలా హ్యాపీగా ఉంటుంది. సినిమాలో నాకు, చరణ్‌కి మధ్య కెమిస్ట్రీ ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. నా క్యారెక్టర్ పేరు 'సీత'. ఫ్యామిలీలో అందరి ముందు చాలా వినయంగా ఉంటూ, రామ్ ఏది చెప్తే అదీ అన్నట్టుగా ఉంటాను. బయట మాత్రం చాలా డామినేటింగ్‌గా ఉంటాను. మా కాంబినేషన్‌లో ఉండే సీన్స్ ఇంట్రెస్టింగ్‌గా ఉంటాయి. సినిమాలో నేను ఎంత టైమ్ స్క్రీన్‌పై కనిపిస్తాను అనేకన్నా, కనిపించినంత సేపు నేనుచసిన పాత్రకు ప్రాముఖ్యత ఉందా లేదా..? అని ఆలోచిస్తా. హిందీలో 'అర్జున్ రెడ్డి' రీమేక్ లో నటిస్తున్నందుకు చాలా ఎగ్జైటెడ్‌గా ఉన్నాను. సినిమాలో లాస్ట్ సీన్ నుండి షూటింగ్ స్టార్ట్ చేశారు. సినిమాలో నేటివిటీకి తగ్గట్టు చిన్న చిన్న చేంజెస్ చేశారు. సినిమా ఢిల్లీ బ్యాక్ డ్రాప్ లో ఉంటుంది'' అన్నారు.

ఒకే నెలలో రెండు చిత్రాలు



● దిల్‌రాజు

అగ్ర నిర్మాతల్లో ఒకరైన దిల్‌రాజు ఇప్పుడు రెండు సినిమాలను ట్రాక్‌లో ఎక్కించడానికి సిద్ధమవుతున్నాడు. మార్చి నెలలో ఈ రెండు సినిమాలను చేయబోతున్నారట. ఇంతకు ఆ రెండు సినిమాలేవంటే... ఒకటి తమిళ చిత్రం '96' రీమేక్. చాలా రోజులుగా ఈ రీమేక్‌లో లీడ్ పెయిర్ కోసం దిల్ రాజు వెతికారు. చివరకు శర్వానంద్, సమంత అక్కినేని నటించబోతు న్నారు. అలాగే ఇంద్రగంటి మోహనక ష్ణ దర్శకత్వంలో నాని, దుల్కర్ సల్మాన్ కాంబినేషన్‌లో మల్టీస్టారర్ చేయబోతున్నాడు. ఈ చిత్రం కూడా మార్చిలోనే ట్రాక్ ఎక్కే అవకాశాలున్నాయట. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతు న్నాయి. త్వర్లోనే అధికారికంగా సమా చారం వెలువడనుంది.

కపిల్‌దేవ్‌లో శ్రీకాంత్‌గా జీవా!



మన దేశానికి తొలిసారి క్రికెట్ ప్రపంచ కప్పును అందించింది కపిల్‌దేవ్. ఈయన నాయకత్వంలో 1983లో ఎలాంటి అంచనాలు లేని భారత జట్టు విశ్వవిజేతగా నిలిచింది. కాగా ఇప్పుడు కపిల్ బయోపిక్‌ను తెరకెక్కించ న్నారు. 'ఏక్‌థా టైగర్' ఫేమ్ కబీర్ ఖాన్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. మరి కపిల్ డెవిల్స్‌గా ఎవరు కనపడతారనేది ఆసక్తికరంగా మారింది. కపిల్ దేవ్ పాత్రలో బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ నటిస్తుండగా.. ఓపెనర్ కృష్ణమాచారి శ్రీకాంత్ పాత్రలో తెలుగు హీరో విజయ్ దేవరకొండ, అల్లు అర్జున్ వంటి హీరోల పేర్లు వినిపించాయి. అయితే తాజా సమాచారం ప్రకారం తమిళ నటుడు జీవా వెటరన్ క్రికెటర్ శ్రీకాంత్ పాత్రలో నటించను న్నారట. అందుకోసం కృష్ణమాచారి ఆధ్వర్యం లోనే జీవా ప్రతిరోజూ రెండు గంటల పాటు శిక్షణ తీసుకుంటున్నారట. రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫాంటమ్ ఫిలింస్, విబ్రి మీడియా బ్యానర్స్‌పై ఈ సినిమా తెరకెక్కుతోంది.

తెలుగు 'రాక్షసన్'?



● బెల్లంకొండ శ్రీనివాస్

ఈమధ్యకాలంలో రీమేక్‌ల హవా ఎక్కువగా నడుస్తోంది. ఒక భాషలో హిట్ అయిన సినిమాలు మరో రెండు భాషల్లోనూ రీమేక్ చేసేందుకు నిర్మాతలు ఉత్సాహం చూపిస్తున్నారు. అలా ఓ తమిళ్ చిత్రం తెలుగులో రీమేక్ కాబోతోంది. తమిళ్‌లో సూపర్‌హిట్ అయిన 'రాక్షసన్' చిత్రం రీమేక్ రైట్స్‌ని హీరో నితిన్ తీసుకున్నారనీ, అతనే ఆ సినిమాలో హీరోగా నటిస్తారని ఆమధ్య వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఈ రీమేక్‌కి సంబంధించిన మరో వార్త కూడా ప్రచారంలో ఉంది. యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఈ రీమేక్‌లో నటిస్తారని ఫిల్మ్‌నగర్ న్యూస్. క్రైమ్ నేపథ్యంలో సినిమాలను తెరకెక్కించాలనే లక్ష్యంతో డైరెక్టర్‌గా ట్రై చేస్తూ ఉండే యువకుడు.. తప్పని పరిస్థితుల్లో పోలీస్ ఆఫీసర్‌గా మారడం.. మిస్టరీగా మారిన ఓ కేసును చేధించే కథతో తెరకెక్కిన ఈ చిత్రం తమిళ్‌లో పెద్ద విజయాన్ని అందుకుంది. ఈ చిత్రం తెలుగు రీమేక్‌కి దర్శకుడెవరు అనేది తెలియాల్సి ఉంది.

సారా అలీఖాన్ 'ఏబీసీడీ'



బాలీవుడు నటుడు సైఫ్ అలీఖాన్ తనయగా ఇండస్ట్రీకి పరిచయమై..'కేదార్‌నాథ్'తో పాటు రీసెంట్‌గా రిలీజైన 'సింబా'తో సక్సెస్‌ను సొంతం చేసుకున్న హీరోయిన్ సారా అలీఖాన్. ఇప్పుడు వరుణ్ ధావన్‌తో కలిసి 'ఏబీసీడీ' చిత్రంలో నటించనుంది. ఈ సినిమాలో ముందుగా కత్రినా కైఫ్‌ను తీసుకోవాలనుకున్నా.. ఆమె డేట్స్ అడ్జస్ట్ కాకపోవడంతో.. ఆమె స్థానంలో సారా అలీఖాన్‌ను తీసుకున్నారు. రెమో డిసౌజా ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నారు. త్వరలోనే సెట్స్‌కు వెళ్లనున్న ఈ సినిమాను 2డీ తో పాటు 3డీలో కూడా తెరకెక్కించబోతున్నారని సమాచారం.

మహేశ్ సినిమాలో...



● కత్రినా కైఫ్

మహేష్‌బాబు, వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'మహర్షి'. ఈ చిత్రం శరవేగంగా షూటింగ్‌ను జరుపుకుంటోంది. ఈ సినిమా తర్వాత సుకుమార్ కాంబినేషన్‌లో సినిమా చేసేందుకు మహేష్ సిద్ధమవుతున్నారు. ఈ సినిమాకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తయింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటిస్తారనే విషయంలో రకరకాల వార్తలు వస్తున్నాయి. అయితే ఫైనల్‌గా బాలీవుడ్ హీరోయిన్ కత్రినా కైఫ్ ఓకే అయ్యిందని టాలీవుడ్ సర్కిల్ న్యూస్. కత్రినా కెరీర్ ప్రారంభంలో రెండు తెలుగు సినిమాల్లో నటించింది. చాలా గ్యాప్ తర్వాత తెలుగులో సినిమా చేయబోతోందని ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు టాలీవుడ్ అంటే బాలీవుడ్ హీరోయిన్లు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. అందుకే హిందీలో టాప్ హీరోయిన్ వెలుగొందుతున్న కత్రినా తెలుగులో నటించేందుకు ఆసక్తి కనబరుస్తోందని తెలుస్తోంది.

జపాన్‌లో విశ్వాసం



● అజిత్

తమిళ్ హీరో అజిత్, దర్శకుడు శివ కాంబినేషన్‌లో వచ్చిన మూడు సినిమాలు పెద్ద విజయాలు సాధించాయి. వీరం, వేదాళం వివేకం సినిమాలు తమిళ్ బాక్సాఫీస్‌ని షేక్ చేశాయి. ఇప్పుడదే కాంబినేషన్‌లో 'విశ్వాసం' పేరుతో మరో సినిమా రూపొందింది. ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదల కాబోతోంది. రజనీకాంత్ 'పేట' కూడా సంక్రాంతికే రిలీజ్ అవుతున్న విషయం తెలిసిందే. ఈ రెండు సినిమాలపై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. రజనీకాంత్ సినిమాలకు విదేశాల్లో కూడా మంచి ఆదరణ ఉన్న విషయం తెలిసిందే. అజిత్‌కి కూడా ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని 'విశ్వాసం' చిత్రాన్ని రష్యాతోపాటు 8 దేశాల్లో విడుదల చేయబోతున్నట్టు సెవంత్ సెన్స్ సినిమాటిక్స్ అనే సంస్థ గతంలో ప్రకటించింది. ఇప్పుడు జపాన్‌లో కూడా 'విశ్వాసం'ను విడుదల చేసేందుకు దాదాపు అన్ని ఏర్పాట్లు జరిగాయి. జపాన్‌కు చెందిన స్పేస్‌పార్క్ అనే సంస్థ ఈ చిత్రాన్ని అక్కడి ప్రధాన నగరాల్లో విడుదల చేస్తోంది.

వారాంతంలో లాభాలు

బ్యాంకింగ్ రంగ షేర్లతో తేరుకున్న సూచీలు

- ఆసియా మార్కెట్ల ర్యాలీతో సానుకూలంగా దేశీయ స్టాక్‌లు
- సెషన్ ముగిసే సమయంలో కొనుగోళ్ల మద్దతు
- ఐటీ తప్ప నిఫ్టీలో రాణించిన మిగతా అన్ని రంగాలు
- సెనెక్స్ 181 పాయింట్ల లాభంతో 35,590 పాయింట్ల వద్ద ముగింపు
- 77 పాయింట్లు లాభపడిన నిఫ్టీ 10,700 పాయింట్ల వద్ద ముగింపు



ముంబై: వరుసగా రెండు రోజుల నష్టాలతో కుదేలైన స్టాక్ మార్కెట్లు శుక్రవారం కాస్త తేరుకున్నాయి. బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్ల ర్యాలీ అండతో నిఫ్టీ తిరిగి 10,700 స్థాయిని అందుకోగా, సెన్సెక్స్ 181 పాయింట్ల లాభాల్ని కూడగట్టుకుంది. తగ్గిన ముడిచమురు ధరలు, రూపాయి డాలర్ మారకంలో బలపడటం, ఆసియాలో పలు మార్కెట్ల లాభాల ట్రేడింగ్ తదితర సానుకూలాంశాలతో శుక్రవారం దేశీయ మార్కెట్ లాభాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించింది. నిఫ్టీ 27 పాయింట్ల లాభంతో 10,700 పాయింట్ల వద్ద, సెన్సెక్స్ 77 పాయింట్ల లాభంతో 35,590 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. లాభాలతో ప్రారంభమైన సూచీలకు ఉదయం సెషన్స్‌లో ఐటీ షేర్లు షాక్‌నిచ్చాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ర్యాలీతో డాలర్ రూపంలో ఆదాయాలను ఆర్జించే ఐటీ షేర్ల నష్టాల బాట పట్టాయి. ఈ రంగంలో అధిక వెయిటేజీ కలిగిన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు 2శాతం క్షీణించడంతో ఈ ప్రభావం సూచీలపై కన్పించింది. దీనికి తోడు వచ్చే వారంలో ఈ ఆర్థిక సంవత్సరపు మూడో త్రైమాసిక ఫలితాల విడుదల కానున్న నేపథ్యంలో ట్రేడర్లు అమ్మకాలకు మొగ్గుచూపడంతో సూచీలు నష్టాల బాట పట్టాయి. ఒకానొక దశలో నిఫ్టీ 44 పాయింట్లను నష్టపోయి 10628 వద్దకు, సెన్సెక్స్ 131 పాయింట్లను కోల్పోయి 35,382 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. అయితే దశలో బ్యాంకింగ్ షేర్ల ర్యాలీ సూచీల నష్టాలకు అడ్డుకట్ట వేసింది. రుణాలను ఇచ్చే సామర్థం తగ్గిపోయిన నేపథ్యంలో క్యాపిటల్ అడెక్వసీ నిబంధనలను మరింత సరళ తరం చేయాల్సిందిగా గురువారం ఆర్‌బీఐని పార్లమెంటరీ ప్యానెల్ కోరడంతో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లు భారీగా లాభపడి సూచీలకు దన్నుగా నిలిచాయి. అలాగే మన మార్కెట్ మిడ్‌సెషన్ ప్రారంభ సమయానికి యూరప్ మార్కెట్లు 1శాతం లాభాల ప్రారంభం ఇన్వెస్టర్లకు మరింత విశ్వాసాన్నినిచ్చాయి. మరోవైపు చివరి అరగంట కొనుగోళ్లు సైతం సూచీలకు కలిసొచ్చాయి.



ఫలితంగా మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 181 పాయింట్ల లాభంతో 35,695 వద్ద, నిఫ్టీ 55 పాయింట్ల పెరిగి 10,727 వద్ద ముగిశాయి. బ్యాంక్ నిఫ్టీ 235 పాయింట్లు లాభపడి 27,195.00 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో రూపాయి ర్యాలీ కారణంగా ఒక్క నిఫ్టీ ఐటీ ఇండెక్స్(1.30శాతం నష్టం) తప్ప మిగితా అన్ని రంగాలకు చెందిన ఇండెక్స్‌లు లాభాలతో ముగిశాయి. అత్యధికంగా ప్రభుత్వరంగ బ్యాంకింగ్ ఇండెక్స్ 2.50 శాతం లాభపడింది.

శుక్రవారం సెషన్‌లో భారతీఇన్ఫ్రాటెల్, టాటామోటర్స్, వేదాంత, యస్‌బ్యాంక్, ఇన్ఫ్రాటెల్ షేర్లు 3శాతం నుంచి 5.50శాతం నమోదు చేశాయి. కాగా ఇండస్‌ఇండ్, హీరోమోటోకార్ప్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 1 శాతం నుంచి 2శాతం నష్టాలను మూటగట్టుకున్నాయి.

అంబానీకి ఆర్థిక కష్టాలు

- ఎరిక్‌సన్ వ్యవహారంలో అనిల్‌కు బిగుస్తున్న ఉచ్చు
- ఆయన్ను అరెస్టు చేయాలని సుప్రీంలో పిటీషన్ దాఖలుత




న్యూఢిల్లీ: అంబానీ సోదరుల్లో అన్న ముఖేశ్ అంబానీ వరుస లాభాలతో దూసుకుపోతుంటే తమ్ముడు అనిల్ అంబానీకి మాత్రం ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. కాగా, ఆర్‌కామ్ అ. దినేత అనిల్‌కు ఎరిక్‌సన్ బకాయిల వ్యవహారం పెద్ద సమస్యగా మారింది. తమకు చెల్లించాల్సిన అప్పులను చెల్లించకపోవడంతో అనిల్‌ను వెంటనే అరెస్టు చేయాలని, దేశం విడిచి పారిపోకుండా నియంత్రణలు విధించాలని స్వీడిష్ టెలికాం పరికరాల తయారీదారు ఎరిక్‌సన్ సుప్రీంకోర్టులో తాజాగా మరో కోర్టుధిక్కార పిటిషన్ వేసింది. తమకు చెల్లించాల్సిన రూ. 550 కోట్లు చెల్లించకుండా కావాలని తాత్సారం చేస్తున్నారని ఆరోపించింది. నిజానికి ఇది తగ్గించిన మొత్తమని, దీనిని చెల్లిస్తానని కోర్టుకు అనిల్ అంబానీ వ్యక్తిగతంగా హామీపత్రం ఇచ్చారని గుర్తు చేసింది. కానీ కోర్టులో కుదిరిన ఒప్పందానికి ఆయన ఏమాత్రం విలువ ఇవ్వడం లేదని తెలిపింది. గత ఏడాది సెప్టెంబర్‌లో గడువు తీరిపోవడంతో అక్టోబర్‌లో ఎరిక్‌సన్ అనిల్‌పై కోర్టుధిక్కార పిటిషన్ వేసింది. దాంతో కోర్టు ఆయనకు డిసెంబర్ 15 వరకు గడువు ఇచ్చింది. కానీ అది కూడా ఉల్లంఘిం చారని ఎరిక్‌సన్ తన పిటిషన్‌లో పేర్కొన్నది. కాగా తాను చెల్లింపులు జరుపకపోవడానికి టెలికమ్యూనికేషన్స్ విభాగం కారణమని ఆర్‌కామ్ విడిగా మరో కోర్టుధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. స్పెక్ట్రమ్ అమ్మకం నిధులు అందజేస్తే ఎరిక్‌సన్‌తో పాటుగా ఇతర కంపెనీలకు తాము బకాయిలు చెల్లించేవారమని ఆర్‌కామ్ పేర్కొంది.

మీ ఉద్యోగాలు పదిలమే

- ప్రభుత్వ రంగ బ్యాంకులపై

లోక్ సభలో జైట్లీ వ్యాఖ్య



న్యూఢిల్లీ: త్వరలో విలీనం కాబోతున్న మూడు ప్రభుత్వ రంగ బ్యాంకుల విషయంపై లోక్ సభలో విత్త మంత్రి అరుణ్ జైట్లీ మరో సారి స్పందించారు. విలీనం పట్ల అపోహలు తగవని ఉద్యోగులు తమ ఉద్యోగం పట్ల ఎలాంటి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం వల్ల ఉద్యోగాల తొలగింపు ఉండదని ఆయన హామీ ఇచ్చారు. కేంద్ర క్యాబినెట్ ఇటీవలే బ్యాంక్ ఆఫ్ బరోడా, దేనా బ్యాంక్, విజయా బ్యాంకుల విలీనానికి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ మూడు బ్యాంకుల విలీనం వల్ల ఎవరి ఉద్యోగం పోదని శుక్రవారం లోక్ సభలో జైట్లీ తెలిపారు. అదే సమయంలో విలీనం వల్ల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మాదిరిగా మరో మెగా బ్యాంక్ ఆవిర్భవిస్తుందని పేర్కొన్నారు. అలాగే రుణ మంజూరు వ్యయాలు తగ్గుతాయని తెలిపారు. 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో.. 11 బ్యాంకులు ఆర్‌బీఐ సత్వర దిద్దుబాటు చర్యల (పీఏసీ) నిబంధనలను ఎదుర్కొంటున్నాయని జైట్లీ పేర్కొన్నారు.

అధిక మొండి బకాయిల సమస్యతో సతమతమౌతోన్న బ్యాం కులపై ఆర్‌బీఐ ఈ పీఏసీ నిబంధనలను విధి స్తుంది. బ్యాంకుల మొండి బకా యిలు (ఎన్‌పీఏ) తగ్గుతాయని జైట్లీ ధీమా వ్యక్తం చేశారు. దివాలా చట్టం వల్ల దాదాపు రూ.3 లక్షల కోట్లు వ్యవస్థలోకి వచ్చాయని పేర్కొన్నారు. ఎస్‌బీఐ సహా ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా నిర్వహణ లాభాలను అర్జిస్తున్నాయని తెలిపారు. అయితే మొండి బకాయిల కేటాయింపుల వల్ల బ్యాంకులు నష్టాలను ప్రకటిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ 31 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.51,533 కోట్లు అందించామని తెలిపారు.

క్యూ3లో ఫార్మా రంగంపై అంచనాలు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అరబిందో ఫార్మా, టొరెంట్ ఫార్మా, కాడిలా హెల్త్‌కేర్ కంపెనీలు బలమైన ఫలితాలు నమోదు చేస్తాయని అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ క్రెడిట్ సూసీ అంచనా వేసింది. ఇదే సమయంలో సిప్లా, డా.రెడ్డీస్ పేలవ ఫలితాలు చూపుతాయని అభిప్రాయపడింది. సన్‌ఫార్మా ఫలితాలు ఇలుమ్యా మందు కారణంగా బాగానే ఉండొచ్చని కానీ ఎబిటా మాత్రం దెబ్బతింటుందని, అధిక ప్రమోషన్ వ్యయాలే ఇందుకు కారణమని వివరించింది. డా.రెడ్డీస్ ఫలితాల్లో ఎబిటా క్రమానుగత క్షీణత ఉంటుందని తెలిపింది. లుమిన్ ఫలితాల్లో మార్జిన్లు మెరుగుపడవచ్చని కానీ టామిఫ్లూ సీజన్ బలహీనంగా ఉండడం ప్రభావం చూపవచ్చని తెలిపింది. అరబిందో మూడో త్రైమాసిక యూఎస్ విక్రయాలు అదరగొడతాయని అంచనా వేసింది. కాడిలా హెల్త్‌కేర్ సైతం యూఎస్‌లో మంచి విక్రయాలు నమోదు చేయవచ్చని కానీ గత గైడెన్స్ అంచనాలను అందుకోలేకపోవచ్చని వివరించింది. టొరెంట్ ఫార్మా విషయంలో యూఎస్, ఇండియా వ్యాపారాల్లో పురోగతి కారణంగా మార్జిన్లు పెరగవచ్చని అంచనా వేసింది. గ్లెన్‌మార్క్‌కు వాజిఫామ్ పునర్వ్యవస్థీకరణ కలిసివస్తుందని అభిప్రాయపడింది.

మళ్లీ హెచ్‌డీఎఫ్‌సీనే టాప్

- మ్యూచ్‌వల్ ఫండ్ విభాగంలో గణాంకాల వెల్లడి

న్యూఢిల్లీ: అతి పెద్ద మ్యూచువల్ ఫండ్ కంపెనీగా హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ నిలిచింది. నిర్వహణ ఆస్తుల పరంగా ఇప్పటివరకూ అగ్రస్థానంలో ఉన్న ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్‌ను తోసిరాజని హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ ఈ స్థానానికి దూసుకువచ్చింది. దాదాపు రెండేళ్ల అనంతరం ఈ కంపెనీ ఈ ఘనతను సాధించింది. ఆంఫి (అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా) వెల్లడించిన వివరాల ప్రకారం గత నెల చివరినాటికి హెచ్‌డీఎఫ్‌సీ ఎమ్ఎఫ్ నిర్వహణ ఆస్తులు రూ.3.35 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇదే కాలానికి ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎమ్ఎఫ్ ఆస్తులు రూ.3.08 లక్షల కోట్లు.-గత ఏడాది అక్టోబర్-డిసెంబర్ క్వార్టర్‌కు హెచ్‌డీఎఫ్‌సీ ఎమ్ఎఫ్ ఆస్తులు 9 శాతం వ ద్ధి చెందగా, ఐసీఐసీఐ ప్రు. ఎమ్ఎఫ్ ఆస్తులు 0.6 శాతం తగ్గాయి.

-2011 నుంచి 2016 వరకూ అగ్రస్థానంలో హెచ్‌డీఎఫ్‌సీ ఎమ్ఎఫ్ కొనసాగింది. ఆ తర్వాత ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎమ్ఎఫ్ ఈ స్థానాన్ని చేజిక్కించుకుంది. రూ. 2.64 లక్షల కోట్ల నిర్వహణ ఆస్తులతో ఎస్‌బీఐ ఎమ్ఎఫ్ మూడో స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఎమ్ఎఫ్(రూ.2.42 లక్షల కోట్లు), రిలయన్స్ ఎమ్ఎఫ్(రూ. 2.36 లక్షల కోట్లు)లు ఉన్నాయి. మొత్తం మీద అన్ని మ్యూచువల్ ఫండ్ సంస్థల నిర్వహణ ఆస్తులు రూ.23.61 లక్షల కోట్లుగా ఉన్నాయి. సెబీ తీసుకుంటున్న వివిధ చర్యల కారణంగా మ్యూచువల్‌ఫండ్ పరిశ్రమ ఈ ఏడాది మరింత జోరుగా వృద్ధి సాధిస్తుందన్న అంచనాలు ఉన్నాయి.

జాన్సన్ అండ్ జాన్సన్ అమ్మకాల్లో క్షీణత



ముంబై: అమెరికా డ్రగ్ తయారీదారు జాన్సన్ అండ్ జాన్సన్ ఉత్పత్తులు భారత్‌లోనూ వివాదస్పదం కావడంతో ఆ కంపెనీ అమ్మకాలు పడిపోయాయి. ఈ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న బేబీ టాల్క్, మెడికల్ ఉత్పత్తుల నాణ్యతపై తీవ్రవిమర్శలు, అనుమానాలు రేగుతున్న విషయం తెలిసిందే. 2002 తర్వాత తొలిసారి గతేడాది అమ్మకాలు పడిపోయినట్లు ఆ కంపెనీ రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్‌కు ఇచ్చిన ఫైలింగ్‌లో వెల్లడించింది. 2018 మార్చితో ముగిసిన ఏడాదిలో కంపెనీ అమ్మకాలు 3 శాతం తగ్గి రూ. 5,828 కోట్లకు పరిమితమయ్యాయి. గత కొద్ది సంవత్సరాలుగా కంపెనీ మార్కెట్ వాటా కూడా తగ్గిపోతుంది. ఇంతక్రితం దశాబ్దంలో ఈ కంపెనీ ప్రతీ ఏడాది సగటు విస్తరణ 10-15 శాతం పెరుగుతూ వచ్చిందని ఇటి ఒక కథనం వెల్లడించింది.భారత్‌లో తమ కంపెనీ లిస్టెడ్ కానందున తమ మార్కెట్, వ్యాపార వివరాలను వెల్లడించలేమని జెఅండ్‌జె పేర్కొంది. ఆ అంశాలు వాణిజ్యపరంగా రహస్యమని పేర్కొంది. 2017-18లో జెఅండ్‌జెకు చెందిన బేబీ టాల్క్, షాంపూ, చెవి పుల్లలు (ఇయర్ బడ్స్), శానిటరీ పాడ్స్ తదితర కన్స్యూమర్ బిజినెస్ భారత్‌లో రూ.3,092 కోట్లకు తగ్గిపోయింది. 2017లో ప్రపంచ వ్యాప్తంగా ఈ కంపెనీ అమ్మకాలు 76.5 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. భారత్‌లోని వ్యాపారంలో నాలుగులో మూడో వంతు బేబీ కేర్ మార్కెట్ నుంచి రూ.4,000 కోట్ల వరకు రెవెన్యూ వస్తుంది. గత రెండేళ్ల నుంచి డాబర్ ఇండియా, హిమాలయ డ్రగ్ కంపెనీ, హిందుస్థాన్ యూనిలీవర్ నుంచి తీవ్ర పోటీ నెలకొంది. మరోవైపు జపాన్‌కు చెందిన యునిచార్మ్, ప్రాక్టర్ అండ్ గాంబిల్ కంపెనీలు సబ్బులు, చర్మ ఉత్పత్తుల్లో జెఅండ్‌జె మార్కెట్ వాటాను 2017లో 4 శాతం వరకు తన్నుకుపోయాయని నీల్సన్ ఇండియా ఒక రిపోర్టులో వెల్లడించింది.

జాన్సన్ ఉత్పత్తి చేస్తున్న బేబీ టాల్కం పౌడర్‌లో కాన్సర్ కారకం ఎతిలేన్ ఆక్సైడ్ ఉందని 2014లో మహారాష్ట్ర రెగ్యూలేటరీ ఆ ఉత్పత్తి లైసెన్స్‌ను రద్దు చేసింది. కాగా జెఅండ్‌జె కోర్టుకు వెళ్లి తిరిగి లైసెన్స్‌ను పొందింది. తమ టాల్క్ తయారీ, టెస్టింగ్ ప్రస్తుత భారత రెగ్యూలేటరీ నిబంధనలకు అనుగుణంగానే ఉందని జెఅండ్‌జె పేర్కొంది. ఈ కంపెనీ టాల్కం పౌడర్‌లో కాన్సర్ కారకాలున్నాయని అమెరికాలోనూ ఆరోపణలు వచ్చాయి. ఈ అంశాన్ని జాన్సన్ దాచి పెట్టిందని గత నెలలోనూ రాయిటర్స్ ఒక కథనం వెల్లడించింది. 2017-18లో జెఅండ్‌జె ఇండియా అమ్మకాలు రూ.5,827.9 కోట్లుగా ఉండగా, ఇదే సమయంలో రూ.687.8 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాదిలో రూ.5,989 కోట్ల అమ్మకాలు నమోదు చేసింది.



బంగారం @ రూ. 32,700

న్యూఢిల్లీ: పసిడి మూడు రోజుల లాభాల ర్యాలీకి అడ్డుకట్ట పడింది. ఢిల్లీ మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర శుక్రవారం రూ.145 నష్టంతో రూ.32,690కి క్షీణించింది. రూపాయితో పోలిస్తే డాలర్ బలహీనపడటం, జువెలర్ల నుంచి ఆదరణ తగ్గడం వంటి అంశాలు బంగారంపై ప్రతికూల ప్రభావం చూపాయని విశ్లేషకులు పేర్కొన్నారు. బంగారం ధర పడిపోయినా కూడా వెండి ధర మాత్రం పరుగులు పెట్టింది. రూ.40,000 మార్క్‌ను దాటేసింది. పరిశ్రమల నుంచి, నాణేపు తయారీదారుల నుంచి డిమాండ్ పెరగడం సానుకూల ప్రభావం చూపింది. దీంతో కేజీ వెండి ధర రూ.440 పెరుగుదలతో రూ.40,140కు ఎగసింది. ఢిల్లీలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.145 క్షీణతతో రూ.32,690కి, 22 క్యారెట్ల బంగారం ధర రూ.145 క్షీణతతో రూ.32,540కి తగ్గింది. ఇక అంతర్జాతీయంగా చూస్తే బంగారం ధర ఔన్స్‌కు 0.11 శాతం క్షీణతతో 1,293.35 వద్ద ట్రేడవుతోంది. గత మూడు రోజుల్లో బంగారం ధర మొత్తంగా రూ.565 మేర పెరిగింది.



ఐటీ కోసం రోజురోజుకు పెరుగుతున్న ఖర్చు

న్యూఢిల్లీ: దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకోసం పెట్టే ఖర్చు రోజురోజుకు అధికమవుతున్నది. ప్రస్తుత సంవత్సరంలో ఐటీ ఖర్చు 11.9 శాతం పెరిగి రూ.2,59,762 కోట్లకు చేరుకోనుందని కోయిస్ ఏజ్ కన్సల్టింగ్ అంచనావేస్తున్నది. ముఖ్యంగా కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వాలు డిజిటల్ రంగానికి పెద్దపీట వేస్తుండటం ఇందుకు దోహదం చేస్తున్నదని తెలిపింది. 2017 నుంచి విశ్లేషిస్తే..పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత టెక్నాలజీ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని, ఆ తర్వాతి ఏడాదిలో ఐటీ రంగం తిరిగి వృద్ధిలోకి వచ్చిందని కోయెస్ ఏజ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అ. దికారి కపిల్ దేవ్ సింగ్ తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచిన ఐటీ రంగం ప్రస్తుత సంవత్సరంలో కూడా ఇదే తీరు వృద్ధిని నమోదు చేసుకునే అవకాశం ఉన్నదన్నారు. 108 మంది పెద్ద, మధ్యస్థాయి దేశీయ ఎంటర్‌ప్రైజెస్‌లకు చెందిన చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారులు/ఐటీ విభాగ అధిపతుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను తయారుచేసింది. కార్పొరేట్లు, ప్రభుత్వాలు కేవలం స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ సేవలకోసం అధికంగా వెచ్చిస్తున్నారట. గతేడాది డిజిటల్ కోసం పెట్టే ఖర్చు 27.5 శాతం పెరుగగా, అదే 2017లో ఇది 25.2 శాతంగా ఉన్నదని నివేదిక వెల్లడించింది.

తాజ్‌కృష్ణా ఎగ్జిక్యూటివ్ చెఫ్‌గా షాహిద్

హైదరాబాద్: ప్రముఖ అతిథ్య సదుయాల సంస్థ తాజ్ గ్రూపునకు చెందిన హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌కి ఎగ్జిక్యూటివ్ చెఫ్‌గా షాహిద్ హుస్సేన్‌ను నియమిస్తున్నట్లు ఆ సంస్థ శుక్రవారం వెల్లడించింది. అభివృద్ధిలో దూసుకుపోతు్న భిన్న సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనమైన చారిత్రక నగరంగా హైదరాబాద్ పేరొందిన హైదరాబాద్‌లో తాను ఎగ్జిక్యూటివ్ చెఫ్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందని షాహిద్ అన్నారు. 2001 వ సంవత్సరం నుంచి షాహిద్ హుస్సేన్ తాజ్‌కృష్ణ హోటల్‌లో అసోసియేట్ చెఫ్‌గా పనిచేస్తున్నారు. తాజ్ ప్యాలెస్‌లో చెఫ్ ట్రైనీగా 17 ఏళ్లు పనిచేశారు. హోటల్ రంగంలో అపారమైన అనుభవం ఆయనకు ఉంది. కాగా, సింగపూర్, స్విజ్జర్‌ల్యాండ్ వంటి దేశాలో భారీ ఎత్తున జరిగే ఫుడ్ ఫెస్టివల్‌లో సైతం పాల్గొన్న ప్రముఖుల్లో షాహిద్ ఒకరు.

వృద్ధి రేటు పెరుగుతోంది

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరం 2019-20లో అధిక వృద్ధి రేటు నమోదు కానుందని ఇటీవల ఒక రిపోర్టులో వెల్లడించింది. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచడానికి పలు చర్యలు తీసుకున్నట్లు 2018 ఏడాది ముగింపు సమీక్షలో పేర్కొంది. ఈ మధ్య కాలంలో ప్రపంచ బ్యాంకు వెల్లడించిన రిపోర్టు ప్రకారం 2018లో సులభ వ్యాపారం ర్యాంకింగ్‌లో భారత్ 77వ స్థానానికి ఎగబాకినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సమీక్ష ప్రకారం 2014-15 నుంచి 2017-18 మధ్య భారత వృద్ధి రేటు సగటున 7.3 శాతంగా నమోదయ్యింది. ప్రపంచంలోని ఇతర ఆర్థిక వ్యవస్థలతో పోల్చితే ఇది వేగవంతమైన వృద్ధి రేటుగా అభివర్ణించింది. 2018-19, 2019-20లో భారత్ అత్యంత వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా నిలువనుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ అక్టోబర్ 2018లో ఇదే విషయాన్ని పేర్కొంది. 2018-19 ప్రథమార్థంలో జిడిపి 7.6 శాతానికి చేరనుంది. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో భారత ఆర్థిక వ్యవస్థ గాడిలో పడటంతో పాటు అధికవృద్ధి రేటును సాధించనుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో విశ్వాసం నింపడానికి పలు చర్యలు తీసుకున్నట్ల ఈ రిపోర్టులో పేర్కొంది. తయారీ రంగానికి ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు విదేశ ప్రత్యక్ష పెట్టుబడుల పాలసీలో మార్పులు, టెక్స్‌టైల్ పరిశ్రమకు ప్రత్యేక ప్రాకేజీ, మౌలిక వసతుల అభివృద్ధి, చౌక గృహాలు, తీర ప్రాంత కనెక్టివిటీపై దృష్టి సారించడం ద్వారా వృద్ధికి మద్దతు లభించింది. 2017-18లో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ 3.3 శాతానికి తగ్గింది. గత ఆరు ఏళ్లలో ఇదే అత్యల్పమని ఈ రిపోర్టు పేర్కొంది.

622/7 డిక్లేర్డ్



- పుజారా డబుల్ సెంచరీ మిస్
- రిషబ్ పంత్ అజేయ సెంచరీ
- జడేజా అర్ధ సెంచరీ
- ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియాకు రెండో భారీ స్కోరు
- ఆస్ట్రేలియా 24/0
- చివరి, నాల్గో టెస్టు

సిడ్నీ: ఆస్ట్రేలియాతో ఇక్కడ జరుగుతున్న చివరి, నాల్గో టెస్టు రెండో రోజు ఆటలో రిషబ్ పంత్, రవీంద్ర జడేజా దూకుడుగా ఆడి, పరుగుల వరద పారించి ఆతిథ్య జట్టును భయపెట్టారు. శుక్రవారం రెండో రోజు ఆటలో టీమిండియా 7 వికెట్ల నష్టానికి 622 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియాకు ఇది రెండో భారీ స్కోరు. 2004లో ఇదే వేదికలో టీమిండియా 7 వికెట్ల నష్టానికి 705 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అయితే తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 24 పరుగులు చేసింది. రోజంతా ఫీల్డింగ్ చేసిన కంగారూలు చివరి గంట సేపు ఆడాల్సి వచ్చింది. చటేశ్వర్ పుజారా డబుల్ సెంచరీ మిస్సయ్యాడు. 373 బంతుల్లో 193 పరుగులకు ఆవుటైన పుజారా ఓవర్‌నైట్ స్కోరుకు 63 పరుగులు జోడించాడు. మరోవైపు సెంచరీ చేసిన భారత తొలి వికెట్ కీపర్‌గా పంత్ నిలిచాడు. 189 బంతుల్లో 159 పరుగులతో అజేయంగా నిలిచాడు. పంత్‌కు ఇది రెండో సెంచరీ. గతేడాది ఇంగ్లాండ్ పర్యటనలో కూడా సెంచరీ సాధించాడు. జడేజా కూడా ఆస్ట్రేలియా బౌలర్లను టెన్షన్ పెట్టాడు. దీంతో ఈ జోడీని విడగొట్టేందుకు చివరికి టాపార్డర్ బ్యాట్స్‌మన్ ఉస్మాన్ ఖవాజాతో కూడా బౌలింగ్ చేయించారు. 15 ఫోర్లు, ఒక సిక్స్ బాదిన పంత్ ఏడో వికెట్‌కు జడేజాతో కలిసి 204 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. ఆస్ట్రేలియా బ్యాటింగ్ విషయానికొస్తే మూడో ఓవర్లో మహ్మద్ షమీ బౌలింగ్‌లో ఉస్మాన్ ఖవాజా ఇచ్చిన క్యాచ్‌ను పంత్ చేజార్చాడు. దీంతో ఆట ముగిసే సమయానికి ఖవాజా (5), మార్కస్ హారిస్ (19) క్రీజులో ఉన్నారు.

149వ ఓవర్లో టీమిండియా 500 పరుగుల మార్క్‌ను దాటడంతో ఎప్పుడెప్పుడు ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేద్దామా అని ఎదురు చూసింది. ప్లేయర్స్ బాల్కనీ నుంచి ఎటువంటి సంకేతాలూ రాకపోవడంతో పంత్, జడేజా బ్యాటింగ్‌ను కొనసాగించారు. 21 పంత్ 137 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. దీంతో ఆస్ట్రేలియాలో టెస్టు సెంచరీ చేసిన భారత వికెట్ కీపర్/బ్యాట్స్‌మన్‌గా రికార్డుల్లోకెక్కాడు. ఆస్ట్రేలియా స్ఫూర్తి దెబ్బతీసేందుకు టీమిండియా బ్యాటింగ్‌ను కొనసాగించింది. జడేజా 89 బంతుల్లో 10వ టెస్టు అర్ధ సెంచరీ సాధించాడు. వీళ్లిద్దరు దూకుడుగా ఆడుతూ 221 బంతుల్లో 200 పరుగుల భాగస్వామ్యాన్ని పూర్తి చేశారు. ఆస్ట్రేలియాపై ఏడో వికెట్‌కు ఇది అత్యధిక భాగస్వామ్యం. 2017 రాంచీలో పుజారా, వృద్ధిమాన్ సాహ 199 పరుగులు చేశారు. తర్వాత ఆస్ట్రేలియా కొత్త బంతిని తీసుకుంది. 168వ ఓవర్లో జడేజాను నాథన్ లియాన్ క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇక వచ్చేయమంటూ కోహ్లీ సైగ చేశాడు.

373 బంతుల్లో 22 ఫోర్లలో జడేజా 193 పరుగులకు అవుట్ కావడంతో టీ విరామం సమయానికి టీమిండియా 6 వికెట్ల నష్టానికి 491 పరుగులు చేసింది. పుజారా 192 పరుగుల వద్ద ఉన్నప్పుడు అతనికి ఒక లైఫ్ లభించింది. 126వ ఓవర్లో లియాన్ బౌలింగ్‌లో పుజారా ఇచ్చిన క్యాచ్‌ను ఖవాజా చేజార్చాడు. అయినప్పటికీ పుజారా తొలి విదేశీ టెస్టు డబుల్ సెంచరీని చేయలేకపోయాడు. బాగా అలసిపోయిన పుజారా నాలుగు ఓవర్ల తర్వాత లియాన్ బౌలింగ్‌లో అతనికే క్యాచ్ ఇచ్చాడు. పుజారా బయటికి వెళుతుంటే సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ ప్రేక్షకులు అతనికి స్టాండింగ్ ఒవేషన్ (లేచి నిలబడి గౌరవించడం) ఇచ్చారు. తర్వాత మరో భాగస్వామ్యం కూడా నెమ్మదిగా ప్రారంభమైంది. ఎనిమిది ఓవర్లలో ఓవర్‌ను 3 చొప్పున పరుగులు నమోదయ్యాయి. కానీ పంత్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగానే వేగం పెరిగింది. అతను 96 బంతుల్లోనే 73 పరుగులు సాధించాడు. మార్నింగ్ సెషన్‌లో పుజారా మరికొన్ని మైలురాళ్లు సాధించాడు. మొదట పుజారా 153 పరుగులు చేయగానే తన విదేశీ టెస్టు అత్యధిక స్కోరును అధిగమించాడు. రెండోదిగా ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో 500కుపైగా పరుగులు చేసిన భారత మూడో బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. 2003-04లో రాహుల్ ద్రవిడ్, 2014-15లో విరాట్ కోహ్లీ ఈ ఘనత సాధించారు. అంతేకాకుండా ఈ నాలుగు మ్యాచ్‌ల్లో పుజారా 1200కుపైగా బంతులను ఎదుర్కొన్నాడు. ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో ఇన్ని బంతులు ఆడిన భారత తొలి బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. 2003-04లో ద్రవిడ్ 1203 బాల్స్ ఆడారు. తొలి రోజు ఆటలో పుజారా 130 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ సిరీస్‌లో అతనికిది మూడో టెస్టు సెంచరీ.

అంతకుముందు 4 వికెట్ల నష్టానికి 303 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన టీమిండియా భోజన విరామ సమయానికి 5 వికెట్ల నష్టానికి 389 పరుగులు చేసింది. పుజారా, హనుమ విహారి కలిసి ఐదో వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. తొలి రోజు విహారి ఎలా ఆడాడో రెండో రోజూ అలాగే ఆడాడు. కానీ అతని శ్రమ వృథా అయింది. 102వ ఓవర్లో లియాన్ బౌలింగ్‌లో విహారి షార్ట్ లెగ్ ఫీల్డర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరో ఎండ్‌లో ఉన్న పుజారా ఎన్నడూ లేనంత దృఢంగా ఆడాడు. ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్‌ను గెలవాలన్న పట్టుదలతో ఉన్న టీమిండియా ఈ నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 2-1తో ఉంది. అడిలైడ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో 31 పరుగులతో, మెల్‌బోర్న్‌లో జరిగిన మూడో మ్యాచ్‌లో 137 పరుగులతో టీమిండియా గెలిచింది. అయితే పెర్త్‌లో జరిగిన రెండో టెస్టులో 146 పరుగులో ఓటమిపాలైంది.



స్కోరు బోర్డు

ఇండియా తొలి ఇన్నింగ్స్ (ఓవర్‌నైట్ స్కోరు 303/4): చటేశ్వర్ పుజారా (సి) అండ్ (బి) లియాన్ 193, విహారి (సి) లబుషేన్ (బి) లియాన్ 42, రిషబ్ పంత్ నాటౌట్ 159, జడేజా (బి) లియాన్ 81; ఎక్స్‌ట్రాలు: 20, మొత్తం 167.2 ఓవర్లలో 622/7 డిక్లేర్డ్; **వికెట్ల పతనం:** 5-329, 6-418, 7-622; **బౌలింగ్:** స్టార్క్: 26-0-123-1, హాజిల్‌వుడ్: 35-11-105-2, కమ్మిన్స్: 28-5-101-0, లియాన్: 57.2-8-178-4, లబుషేన్: 16-0-76-0, హెడ్: 4-0-20-0, ఖవాజా: 1-0-4-0.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: మార్కస్ హారిస్ నాటౌట్ 19, ఉస్మాన్ ఖవాజా నాటౌట్ 5; మొత్తం 10 ఓవర్లలో 24/0; **బౌలింగ్:** షమీ: 3-0-9-0, బుమ్రా: 3-0-12-0, జడేజా: 2-1-1-0, కుల్‌దీప్: 2-1-2-0.

ధోనీని దాటేసిన రిషబ్ పంత్

ఆస్ట్రేలియాలో సెంచరీ చేసిన తొలి టీమిండియా వికెట్‌కీపర్‌గా రికార్డు

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా గడ్డపై ఇంతవరకు ఏ ఒక్క భారత వికెట్ కీపర్ కూడా టెస్టుల్లో సెంచరీ సాధించలేదు. సిడ్నీ టెస్టులో 21ఏళ్ల పంత్ ఈ ఘనత అందుకున్నాడు. ఈ రికార్డుతో పంత్ టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీని దాటేశాడు. ఇప్పటికే అత్యధిక క్యాచ్‌లు ఇప్పటి వరకు ఇక్కడ మాజీ క్రికెటర్ ఫరూక్ ఇంజినీర్ (89) అత్యుత్తమ స్కోరు. తాజాగా రిషబ్ పంత్ 137 బంతుల్లో సెంచరీ పూర్తి చేసి టెస్టు కెరీర్‌లో రెండో శతకం సాధించాడు. మొత్తంగా ఇన్నింగ్స్‌లో పంత్(159 నాటౌట్: 189 బంతుల్లో 15ఫోర్లు, సిక్స్)తో భారీ సెంచరీతో నాటౌట్‌గా నిలిచాడు. గతంలో ఆసీస్ పర్యటనకు వచ్చిన వికెట్ కీపర్లలో ఇంజినీర్(89, 1991లో).. కీరన్ మోరే (67 నాటౌట్ 1991), పార్థీవ్ పటేల్(62, 2004లో).. మహేంద్ర సింగ్ ధోనీ(57 నాటౌట్, 2012లో) ఉన్నారు. విదేశీ గడ్డపై అత్యధిక స్కోరు చేసిన వికెట్ కీపర్ కూడా పంతే. గతంలో 2006లో ఫైసలాబాద్‌లో పాకిస్థాన్‌తో టెస్టులో భారత మాజీ కెప్టెన్ ధోనీ 148 పరుగులతో ఇప్పటి వరకు అగ్రస్థానంలో కొనసాగాడు. తాజాగా పంత్(159 నాటౌట్) ధోనీని అధిగమించాడు.

ఆసీస్ సెలక్షన్‌పై మండిపడ్డ షేన్ వార్న్


సిడ్నీ: భారత్‌తో వన్డే సిరీస్‌కు ప్రకటించిన ఆసీస్ జట్టు ఎంపికపై మాజీ స్పిన్ దిగ్గజం షేన్ వార్న్ నిప్పులు చెరిగాడు. భారత్‌తో ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం క్రికెట్ ఆస్ట్రేలియా 14 మందితో కూడిన జట్టును ప్రకటించింది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ప్రదర్శన బాగాలేదంటూ ఐదుగురు ఆటగాళ్లు ట్రావిస్ హెడ్, క్రిస్ లిన్, డిఆర్కీ షార్ట్, బెన్ మెక్ డెర్మాట్, ఆల్‌రౌండర్ ఆష్టన్ అగర్‌లను జట్టు నుంచి తప్పించింది. మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్‌లకు విశ్రాంతి ఇవ్వగా నాథన్ లియాన్, ఉస్మాన్ ఖ్వాజా, వెటరన్ పీటర్ సిడెల్‌లను జట్టులోకి తీసుకుంది. జట్టు కూర్పుపై షేన్ వార్న్



తీవ్ర విమర్శలు గుప్పించాడు. సెలక్షన్ హాస్యాస్పదంగా ఉందని, సెలక్షన్‌లో కొంచెం కూడా బుర్ర ఉపయోగించలేదని మండిపడ్డాడు. ఇలాంటి సెలక్షన్ ఏ ఫార్మాట్‌లోనూ పనికిరాదని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అంతకుముందు భారత్‌తో తలపడే ఆసీస్ జట్టు ఇలా ఉండబోతోందంటూ ఓ జాబితాను ట్విట్టర్‌లో విడుదల చేశాడు. దీనికీ, క్రికెట్ ఆస్ట్రేలియా ఎంపిక చేసిన జట్టుకు ఏమాత్రం పొంతన లేకుండా పోయింది. ఆరు నెలల పాటు వన్డే ఫార్మాట్‌కు దూరంగా ఉన్న లియాన్‌ను, జనవరి 2017లో పాకిస్థాన్‌తో ఆడిన వన్డే తర్వాత ఒక్క మ్యాచ్ కూడా ఆడని ఉస్మాన్ ఖ్వాజాను జట్టులోకి తీసుకోవడాన్ని వార్న్ తీవ్రంగా తప్పుబట్టాడు. అలాగే, నవంబరు 2010లో చివరిసారి వన్డే మ్యాచ్ ఆడిన మీడియం పేసర్ పీటర్ సిడెల్ (34)ను జట్టులోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నించాడు. జట్టు కూర్పుపై సెలక్టర్ ట్రెవర్ హాన్స్ మాట్లాడుతూ.. ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఆటగాళ్లను ఎంపిక చేసినట్టు తెలిపాడు. కాగా, వార్న్ ప్రకటించిన జట్టులో ఉన్న అగర్, షార్ట్, జేమ్స్ ప్యాటిసన్‌లకు ఆసీస్ జట్టులో చోటు లభించ లేదు.

విహారి అవుట్ వివాదం

- థర్డ్ అంపైర్ కూడా తప్పుడు నిర్ణయం
- టెక్నాలజీపై అపనమ్మకం



సిడ్నీ: మెల్‌బోర్న్‌లో మూడో టెస్టులో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన భారత బ్యాట్స్‌మన్ హనుమ విహారీ చివరి, నాల్గో టెస్టులోనూ మిడిలార్డర్ స్థానంలో బరిలోకి దిగేందుకు ఇష్టపడ్డాడు. సీమ్, స్పిన్ బౌలింగ్‌లలో ఆడేందుకు ఇష్టపడే విహారి ఏ స్థానంలోనైనా ఆడేందుకు సిద్ధంగా ఉంటాడు. నాల్గో టెస్టు తొలి రోజు ఆటలో 39 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. రెండో రోజు పిచ్ ఏమాత్రం సహకరించకపోవడంతో ఆస్ట్రేలియా బౌలర్లు అలసిపోయారు. దీన్ని అవకాశంగా తీసుకున్న విహారి బాగా ఆడి జట్టులో సుస్థిర స్థానం సంపాదించాలనుకున్నాడు. ఈ నేపథ్యంలో విహారి ఆచి తూచి ఆడుతూ తొలి గంట వ్యవధిలో 36 బంతులు ఆడాడు. అయితే నాథన్ లియాన్ బౌలింగ్‌లో స్వీప్ షాట్ ఆడబోయాడు. గాల్లోకి లేచిన బంతిని ఫార్వర్డ్ షార్ట్ లెగ్ స్థానంలో ఉన్న మార్నస్ లబుషేన్ క్యాచ్ పట్టాడు. వెంటనే ఫీల్డ్ అంపైర్ అవుటివ్వడంతో విహారి నమ్మలేకపోయాడు. దీంతో నిర్ణయం థర్డ్ అంపైర్ వద్దకే చేరింది. రీ ప్లేలో బంతి విహారి బ్యాట్‌కు కాకుండా కండరాలకు తాకినట్టు కనిపిస్తోంది. బ్యాట్‌కు, బాల్‌కు మధ్య చాలా దూరం ఉన్నప్పటికీ స్నికోలో చిన్న స్పైక్ కనిపించింది. దీంతో అసలు విషయం కళ్లెదుట కనిపిస్తున్నా టెక్నాలజీని నమ్మిన థర్డ్ అంపైర్ అవుటివ్వడం వివాదాస్పదమైంది.

మిథాలీకి నాకు ఎటువంటి విభేదాలు లేవు

- భారత మహిళల టీ20 జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్

న్యూఢిల్లీ: భారత మహిళల వన్డే జట్టు కెప్టెన్ మిథాలీరాజ్‌కు, తనకు ఎటువంటి విభేదాలు లేవని హర్మన్‌ప్రీత్ కౌర్ స్పష్టం



చేసింది. ఇటీవల విండీస్‌లో జరిగిన మహిళల టీ20 వరల్డ్ కప్ సెమీస్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో మిథాలీకి అవకాశం ఇవ్వని సంగతి తెలిసిందే. ' నేను మిథాలీ కలుస్తూనే ఉన్నాం. మాట్లాడుకుంటున్నాం. మా మధ్య ఎటువంటి సమస్యలు లేవు. మేము ఒక ఇంటర్నేషనల్ జట్టు తరుపున ఆడుతున్నాం. జట్టు అంతా ఒక కుటుంబంలా కలిసి ఉంటుంది. కుటుంబం అన్నాక సమస్యలు వస్తూ ఉంటాయి, పోతుంటాయి. వాటిని మేము వ్యక్తిగతంగా తీసుకోము' అని కౌర్ తెలిపింది. కౌర్ ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న బిగ్‌బాష్ లీగ్‌లో ఆడుతుంది.

ఆస్ట్రేలియా ఓపెన్‌కు షరపోవా దూరం?



- మాజీ నంబర్ వన్‌కు గాయం

షెన్‌జెన్: ప్రపంచ మాజీ నంబర్ వన్ మారియా షరపోవా ఈ ఏడాది తొలి గ్రాండ్ శ్లామ్ ఆస్ట్రేలియా ఓపెన్ సన్నాహానికి గట్టి దెబ్బ తగిలింది. షెన్‌జెన్ ఓపెన్‌లో ఆడుతున్న ఆమె శుక్రవారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అరినా సబలెంకతో ఆడుతున్న సమయంలో తీవ్ర గాయానికి గురైంది. తొలి సెట్‌ను 2-1తో సొంతం చేసుకున్న షరపోవా కోర్టులో కదల్లేకపోవడంతో వైద్య సహాయం తీసుకోమని ఆమె కోచ్ థామస్ సూచించారు. వైద్య సహాయం అనంతరం ఆమె తన సర్వీస్‌ను నిలుపుకోవడమే కాకుండా ప్రత్యర్థిని టెన్షన్ పెట్టి మూడుసార్లు బ్రేక్ పాయింట్ అవకాశాలను సాధించింది. అయినప్పటికీ సబలెంక ఉత్సాహంగా ఆడి 4-2 ఆధిక్యం సంపాదించింది. అయితే తర్వాత రష్యా ప్లేయర్ షరపోవా ఆడలేని పరిస్థితుల్లో మ్యాచ్ నుంచి వైదొలగింది. 2008లో ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ గెలిచిన షరపోవా 15 నెలల నిషేధం తర్వాత 2017లో టియాంజిన్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. అయితే గ్రాండ్ శ్లామ్స్‌లో కొనసాగేందుకు ఎదురైన అడ్డంకులను ఆమె భరించింది. చివరికి గతేడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. కానీ వింబుల్డన్, యూఎస్ ఓపెన్‌లలో ఆరంభ టోర్నీ నుంచి వైదొలగడం చూస్తే అత్యున్నత పోటీల్లో పాల్గొనేంత చురుకుదనం ఆమెకు లేనట్టు అనిపించింది. ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్ ఈ నెల 14న మెల్‌బోర్న్‌లో ప్రారంభం కానుంది.

సిడెల్, ఖ్వాజాలకు పిలుపు

- భారత్‌తో వన్డే సిరీస్‌కు జట్టును ప్రకటించిన ఆసీస్



సిడ్నీ: భారత్‌తో ఈనెల 12 నుంచి ప్రారంభంకానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం ఆస్ట్రేలియా సెలక్టర్లు 14 మందితో కూడిన జట్టుని శుక్రవారం ప్రకటించారు. అగ్రశ్రేణి ఫాస్ట్ బౌలర్లు మిచెల్ స్టార్క్, హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్ టెస్టు సిరీస్‌లో వరుసగా మ్యాచ్‌లు ఆడటంతో వారికి విశ్రాంతినిచ్చిన ఆస్ట్రేలియా.. పీటర్ సిడిల్, ఉస్మాన్ ఖ్వాజా, స్టాన్‌లేక్, స్టాయినిస్, రిచర్డ్‌సన్‌ని ఎంపిక చేసింది. ఇక టెస్టు సిరీస్‌లో ఓపెనర్‌గా విఫలమైన అరోన్ ఫించ్ కెప్టెన్‌గా ఎంపికవ్వగా.. వికెట్ కీపర్‌గా అలెక్స్ క్యారీకి అవకాశం దక్కింది. ఫాస్ట్ బౌలర్ పీటర్ సిడిల్ దాదాపు 8ఏళ్ల తర్వాత మళ్లీ ఆస్ట్రేలియా వన్డే జట్టులో చోటు దక్కించుకోవడం విశేషం. ఈ ఏడాది వన్డే ప్రపంచకప్ జరగనుండటంతో సీనియర్ ఆటగాళ్లకి సైతం ఆస్ట్రేలియా ఈ సిరీస్‌లో అవకాశం ఇచ్చింది. స్పిన్నర్ నాథన్ లియాన్, మిచెల్ మార్ష్, షాన్ మార్ష్, మ్యాక్స్‌వెల్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ నెల 12న సిడ్నీ వేదికగా తొలి వన్డే.. ఆ తర్వాత అడిలైడ్ వేదికగా 15న రెండో వన్డే, 18న మెల్‌బోర్న్‌లో చివరి వన్డే జరగనుంది.

ఆస్ట్రేలియా వన్డే జట్టు: అరోన్ ఫించ్ (కెప్టెన్), ఉస్మాన్ ఖ్వాజా, బెరెండ్రాఫ్, అలెక్స్ క్యారీ (వికెట్ కీపర్), హ్యాండ్స్ కబ్, , నాథన్ లియాన్, మిచెల్ మార్ష్, షాన్ మార్ష్, గ్లెన్ మాక్స్‌వెల్, రిచర్డ్ సన్, పీటర్ సిడెల్, స్టాన్‌లేక్, స్టాయినిస్, ఆడమ్ జంపా.

అరుణ రెడ్డిని సత్కరించిన కాంటినెంటల్ హాస్పిటల్స్

హైదరాబాద్: భారత జిమ్నాస్ట్ అరుణ రెడ్డిని శుక్రవారం కాంటినెంటల్ హాస్పిటల్స్ వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అరుణ రెడ్డి 2020లో జరగబోయే



ఒలింపిక్స్‌కు అర్హత సాధించి అందులో పతకం సాధించటమే ప్రస్తుతం తన లక్ష్యమని తెలిపింది. ఈ మేరకు శుక్రవారం నగరంలో కాంటినెంటల్ హాస్పిటల్స్ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న అరుణ రెడ్డి మాట్లాడుతూ.... ' మా నాన్న నాకు స్ఫూర్తి. పది సంవత్సరాల వయస్సులోన వచ్చిన నేషనల్ మెడలే నాకు స్పోర్ట్స్ మీద ఆసక్తిని కలిగించేలా చేసింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పతకం సాధించటమే నా లక్ష్యం. గత కొంతకాలంగా మోకాలి గాయంతో బాధపడుతున్న నేను ఈ ఏడాది అక్టోబర్‌లో జపాన్‌లో జరగబోయే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్నా' అని అరుణ రెడ్డి తెలిపింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District. Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.